S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 73 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 27 డిసెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

## సాహస బాలలకు బాల పురస్కార్ అవార్డులు

### అవార్డులను అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ :** న్యూఢిల్లీ వేదికగా 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్' కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఢిల్లీలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిన్నారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ పురస్కారాలు ధైర్య సాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, ఇన్నోవేషన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు అనే ఆరు విభాగాల్లో సృజనాత్మకత చూపించిన వారికి అందించారు. అవార్డు గెలుచుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులకు రాష్ట్రపతి

మిగతా 3 లో

## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం చీఫ్ జస్టిస్ ఆందోళన

### పర్యావరణవేత్తలే పరిష్కారం కనుగొనాలి




3




# భారత్‌లో మేధకు కొదవ లేదు

### మన పురాణ పురుషులు గొప్పలు తెలుసుకోవాలి



## అంతర్ జ్ఞానమే అందరికీ శ్రీరామరక్ష

క్షమాగుణమే మనిషిని ఉన్నత స్థితికి చేరుస్తుంది

ప్రతి ఒక్కరూ కర్తవ్య నిర్దేశంతో ముందుకు సాగాలి

భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

5

## బ్యాట్ మ్యాన్, ఐరన్ మ్యాన్ కంటే అర్జునుడు యోధుడు

ఇవన్నీ మన పిల్లలకు తెలియ చేయాలి

భారత్ శక్తివంతమైన దేశంగా ఎదుగుతోంది

తిరుపతి విజ్ఞాన్ సమ్మేళన్‌లో సీఎం చంద్రబాబు

**తిరుపతి :** భారత్‌లో మేధకు కొదవ లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శుక్రవారం తిరుపతిలోని సంస్కృతి యూనివర్సిటీలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్‌ను ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. హాలీవుడ్‌లో హీరోల కంటే మన పురాణాల్లోని

మిగతా 5 లో



## రాజకీయ ముసుగులో రౌడీయిజం సహించం

రప్పారప్పా అంటూ జంతుబలులు.. రక్తాభిషేకాలా

ఇలాంటి దుర్మార్గాలను సహించబోం

జిల్లా పోలీస్ కార్యాలయం ప్రారంభంలో చంద్రబాబు

5

## మహా జాతర నిర్మాణ పనులు ఒక మైలురాయి

### కనీవినీ ఎరుగని రీతిలో సమ్మక్క సారలమ్మ మహా జాతర

శాశ్వతంగా 200 ఏళ్లు నిలిచేలా గద్దెల పునర్నిర్మాణం

మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి..

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట

2





## మా అయ్య మొగోడు

తెలంగాణ తెచ్చిన మొనగాడు

మా అయ్య పేరు బరాబర్ చెప్పకుంటా

రేవంత్ రెడ్డి భీమవరం బుల్లోడు

దమ్ముంటే ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ నేర్చుకో

ఢిల్లీకి సంచులు మోసి పదవి కాపాడుకోవడం కాదు

ఇచ్చిన హామీలను అమలు చేసి చూపాలి

సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

3



## మళ్లీ ఉద్యమం

### ప్రభుత్వంపై కేసీఆర్ సమరశంఖం

- నిధులు, నీళ్లు, నియామకాలపై మరోమారు జంగ్
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ సభలు
- మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల ముఖ్య నేతలతో సమీక్ష

**గజ్వేల్, డిసెంబర్ 26:** పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై బీ ఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు సమరశంఖం పూరించారు. గత అసెంబ్లీ ఎన్నిక ల్లో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ ఆశించిన ఫలితాలను సాధించలేకపోయిన నేపథ్యంలో, మళ్లీ 'నీళ్లు–నిధులు–నియామకాలు' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారు.

మిగతా 2 లో



# మన్మోహన్ సింగ్‌కు నివాళి

**హైదరాబాద్, డిసెంబర్ 26:** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మొదటి వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు ఘనంగా నివాళి అర్పించారు. మన్మోహన్ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జూబ్లీ హిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి సీఎం తదితరులు నివాళులు అర్పించారు. ఈ క్రయక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డిలు ఉన్నారు.

# వివాహితకు వేధింపులు

## వ్యక్తిని చెప్పలతో కొడుతూ పోలీసులకు అప్పగింత

## ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీతో పాటు లైంగిక వేధింపుల కేసు నమోదు




**నిజామాబాద్, డిసెంబర్ 26:** వివాహితను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాన్సువాడలో ఓ మహిళను ఏనుగు రవీందర్ రెడ్డి ప్రధాన అనుచరుడైన దేవేందర్ రెడ్డి కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయం సదరు మహిళ ఆమె భర్తకు చెప్పడంతో దేవేందర్ రెడ్డికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో దేవేందర్ రెడ్డిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీతో పాటు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. బాన్సువాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న మహిలను దేవేందర్‌రెడ్డి వేధింపులకు గురిచేస్తున్నాడు. నెలరోజులుగా దేవేందర్‌రెడ్డి వేధింపులు భరించలేక సదరు మహిళ తన భర్తకు విషయం చెప్పింది. గురువారం కూడా మహిళను దేవేందర్‌రెడ్డి వేధిస్తుండగా ఆమె భర్త అక్కడికి చేరుకొని అతడిని పట్టుకున్నాడు. తీవ్ర ఆగ్రహం చెందిన ఆయన దేవేందర్‌రెడ్డిని దవాఖాన నుంచి నడిరోడ్డుపై చెప్పులతో కొడుతూ పోలీసు స్టేషన్ వరకు తీసుకెళ్లి, పోలీసులకు అప్పగించాడు. బాధితురాలిని, ఆమె భర్తను కాంగ్రెస్ నాయకుడు బుజ్జగించే ప్రయత్నం చేసినా ఫలితంలేకపోయింది. సాయంత్రం బాధిత కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌కు వెళ్లినట్టు సమాచారం.

# కంపెనీలో మేనేజర్‌పై గ్యాంగ్‌రేప్

## కంపెనీ సీఈవోతో పాటు మరో ఇద్దరి అరెస్టు

**జైపూర్, డిసెంబర్ 26:** రాజస్థాన్‌లోని ఓ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న మహిళ గ్యాంగ్ రేప్‌కు గురైంది. ఈ ఘటన ఉదయ్‌పూర్‌లో జరిగింది. ఆ కేసుతో లింకున్న ప్రైవేటు కంపెనీ సీఈవోతో పాటు మరో ఇద్దర్ని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఓ ప్రైవేటు కంపెనీలో సీఈవోగా చేస్తున్న జితేశ్ సిసోడియా.. వారం క్రితం బర్త్‌డే పార్టీ ఇచ్చాడు. ఆ పార్టీకి మహిళా మేనేజర్ కూడా హాజరైంది. ఈ కేసులో మరో మహిళా ఎగ్జిక్యూటివ్, ఆమె భర్త గౌరవ్ సిరోహి నిందితులుగా ఉన్నారు. గురువారం ముగ్గుర్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నాలుగు రోజుల కస్టడీలోకి తీసుకున్నారు. బీఎన్ఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద సుఖేర్ పోలీసు స్టేషన్‌లో కేసు బుక్ చేశారు. నిందితుల్ని రిమాండ్‌కు పంపినట్లు ఉదయ్‌పూర్ ఎస్పీ యోగేశ్ గోయల్ తెలిపారు. బర్త్‌డే పార్టీ ముగిసిన తర్వాత అతిథులు అందరూ వెళ్లిపోయారని, అయితే మహిళా ఎగ్జిక్యూటివ్ .. లేడీ మేనేజర్‌ను ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని చెప్పింది. కారులో బాధిత మేనేజర్‌తో పాటు సిసోడియా,సిరోహి ఉన్నారు. దారిలో ఓ చోట ఆగి సిగరెట్లు కొన్నారని, ఆ సిగరేట్ తాగిన తర్వాత స్పృహ కోల్పోయినట్లు మేనేజర్ చెప్పింది. మరుసటి రోజు మళ్లీ నిద్ర లేచినట్లు పేర్కొన్నది. అయితే తనపై లైంగిక దాడి జరిగినట్లు అప్పుడు గుర్తించినట్లు ఆమె తెలిపింది.

# ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదం: టెక్కీ మృతి

**హైదరాబాద్, డిసెంబర్ 26:** అతివేగం ఓ యువకుడి ప్రాణాన్ని బలి తీసుకుంది. నగరంలోని గచ్చిబౌలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువ సాఫ్ట్‌వేర్ ప్రాణాలు కోల్పోయాడు. వరంగల్ జిల్లాకు చెందిన పునీత్ యాదవ్ (23) గౌలిదొడ్డిలోని ఓ హాస్టల్‌లో ఉంటూ గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై పునీత్, అతడి స్నేహితుడితో కలిసి గౌలిదొడ్డి నుంచి గచ్చిబౌలికి వస్తున్నాడు. అయితే పునీత్ వేగంగా బైక్‌ను నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో పునీత్, అతడి స్నేహితులు కిందపడిపోయారు. బైక్ నడుపుతున్న పునీత్ యాదవ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న అతడి స్నేహితుడు మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడ్డ వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే పునీత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మాట నిలబెట్టుకున్న హరీశ్ రావు

**సంగారెడ్డి, డిసెంబర్ 26:** మాజీ మంత్రి హరీశ్ రావుమరోసారి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం సజ్జాపూర్ గ్రామానికి చెందిన బేగరి రాములును గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమకు ఓటు వేయలేదనే ద్వేషంతో సర్పంచ్, ఆమె కుమారుడు ప్రసాద్ రెడ్డి రాములుకు చెందిన ఇంటిని జేసీబీతో ఈ నెల23వ తేదీన కూల్చివేశారు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధితుడు హరీశ్ రావుతో మొరపెట్టుకున్నారు. స్పందించిన హరీశ్ రావు తనవంతుగా లక్ష రూపాయలను అందజేస్తాని హామీ ఇచ్చారు. కాగా, హరీశ్ రావు అందదించిన నగదును లక్ష రూపాయల నగదును శుక్రవారం జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు చేతుల మీద అందజేశారు. బాధిత కుటుంబానికి బీఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మహా జాతర నిర్మాణ పనులు ఒక మైలురాయి

**ములుగు, డిసెంబర్ 26:** ప్రపంచ చరిత్రలోనే సమ్మక్క సారలమ్మ మహా జాతర నిర్మాణ పనులు ఒక మైలు రాయిగా నిలిచిపోతాయనీ ,నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉం డేలా చేపడుతున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. 4 వేల టన్నుల గ్రానైట్‌పై ఆదివాసీ చరిత్ర సం స్కృతి తెలియజేసే 7,000 బొమ్మలతో సమ్మక్క సారలమ్మ నిర్మాణం పనులు వేగవంతంగా సాగు తున్నాయని స్పష్టం చేశారు. శుక్రవారం ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క సారలమ్మ పునర్ నిర్మాణం పనులు పరిశీలించేందుకు హైదరాబాదు నుంచి మీడియా ప్రతినిధుల బృందం వచ్చింది. సమ్మక్క సారలమ్మ చరిత్ర ,పునర్నిర్మాణ నిర్మాణ పనులు ఆదివాసీల మూలాలు జాతర చరిత్రను మీడియా బృందానికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరను ఈసారి కొత్త రూపుతో.. వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. ఈసారి ఎప్పుడూ కల్పించే తాత్కాలిక సౌకర్యాలతోపాటు శాశ్వత నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎన్నడూ లేనివిధంగా రూ.251 కోట్లతో మేడారం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఇందులో ప్రధానంగా వనదేవతల గద్దెల విస్తరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందనీ ఈ పనులకే రూ.101 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. పునరుద్ధరణ పనులు చేపట్టే సమయంలో గిరిజన పూజారులతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి పూజారుల సంఘం అభిప్రాయం తీసుకుని పూజారులను ఒప్పించడం జరిగిందని, ఒకే లైన్లో వన దేవతలు ఉ ండడం వలన భక్తులు దర్శనాలు చేసుకోవడానికి సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. పూర్వకాలంలో గిరిజనులకు పసుపుతో ఎంతో బంధం ఉందని, శాస్త్రీయంగా పసుపుతో పలు వ్యాధులను నయం చేసుకునే అవకాశం ఉందని దీనిని వాడకం చేయడం వలన పూర్వం లో ఆదివాసులు ఎలాంటి వ్యాధుల బారిన పడిన పసుపును వాడుకున్నారని తెలిపారు. సమ్మక్క తల్లి గోత్రం బండారి గోత్రమని, తమ ఆదివాసీల సాంప్రదాయం ప్రకారం ప్రతి పనిని కుడి నుండి ఎడమవైపు నడుస్తుందని, నవగ్రహాలు సైతం కుడి నుండి ఎడమవైపే తిరుగుతున్నాయని వివరించారు. స్వస్తిక్ ఏర్పాటు చేసే విషయంలో సైతం పకృతి సిద్దాంతాన్ని ఆచరించామని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులు ఓకే వరుస క్రమంలో సులభతరంగా దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతర కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా జరుపుతామని మంత్రి తెలిపారు. చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తున్నామని భక్తులందరూ విజయవంతనికి కృషి చేయాలని సహకరించాలని కోరారు. ఆదివాసిల సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ ప్రతి నిర్మాణం చేపడుతున్నామని సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆదివాసి పూజార్ల సంఘం ప్రతినిధుల ఆమోదంతోనే పునర్నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. చరిత్రలో సుమారు 250 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడ రాజీ పడకుండా పనులు చేపట్టేలా ప్రతినిత్యం సమీక్షిస్తున్నామని నిత్యం మంత్రుల బృందం పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేస్తూ పనులు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరలో పూర్తికానున్నాయని. తెలిపారు గతంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మేడారం సందర్శించారని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు ఆదివాసీలు ఆలయాన్ని విస్తరించాలని కోరగా అధికారంలోకి రాగానే తప్పకుండా ఆలయాన్ని పునర్నిర్మిస్తామని మాట ఇచ్చి నేడు నిలుపుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి 251 కోట్లు మంజూరు చేశారని మేడారం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని పనులను వేగవంతం చేస్తున్నారని నిత్యం నిర్మాణం పనులను సమీక్ష చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్ హాయంలో తాత్కాలిక పనుల పేరిట నిధులను ఖర్చు ఇప్పుడు అలా కాకుండా ప్రభుత్వం పక్కా పకడ్బందీ వ్యూహంతో శాశ్వతంగా నిర్మాణ పనులు చేపడుతున్నదని చెప్పారు. చరిత్రలోనే కనివీని ఎరుగని రీతిలో ఈ దఫా సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నామని భక్తులంతా సహకరించాలని పేర్కొన్నారు. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నామని. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుందన్నారు. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయి అని వివరించారు గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం ఉంటుంధని తెలిపారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా వివరించారు. ప్రధాన స్వాగత తోరణంపై సమ్మక్క వంశీయుల చరిత్ర తెలిపే 59 బొమ్మలు చెక్కించామని పేర్కొన్నారు. దాదాపు 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించి ఏడు వేల బొమ్మలుంటాయని పేర్కొన్నారు. డాక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 250 మంది శిల్పులు పనిచేశారనీ, స్థపతులు ఈమని శివనాగిరెడ్డి, డాక్టర్ మోతీలాల్ పర్యవేక్షిస్తున్నారనీ చెప్పారు



సమ్మక్క-సారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్కు చెందిన 15 మంది విద్యార్థులు ఈ చిత్రాల రూపకల్పనలో సాయం అందించారని పేర్కొన్నారు.గద్దెల ప్రాంగణానికి సమీపంలో ఇదివరకు ఉన్న చెట్లను దాదాపు తొలగించకుండానే అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వనదేవతల పూజల్లో విశిష్టత కలిగిన బండారి, మర్రి, వెదురు, బూరుగ, వేప, ఇప్ప, కస్తు వంటి 12 రకాల చెట్లు, 140 రకాల ఆయుర్వేద మొక్కలు నాటనున్నామని పేర్కొన్నారు. మేడారం ఆలయంలో పునర్నిర్మాణ పనులు వేగవంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నది. పనులను పరిశీలిస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నది. పనుల్లో పూర్తి నాణ్యత పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఏది అవసరం పడిన వెంటనే తెప్పిస్తున్నారు. అధికారుల పురమయిస్తూ పనులు వేగవంతానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రతి రోజు పనుల వేగవంతం పై అడిగి తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉన్నాయి. త్వరలో అన్ని పనులు పూర్తీ అవుతాయి.మంత్రుల బృందాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులకు ఆదేశాలిస్తూ ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారు. ఈసారి సమ్మక్క సారలమ్మ జాతరను బ్రహ్మాండంగా విజయవంతం చేసేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రుల బృందం ప్రతిరోజు పనులను పర్యవేక్షిస్తూ వేగవంతం చేస్తున్నది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఈ ఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, స్థపతి శివనాజిరెడ్డి, మైపథి అరుణ్ కుమార్, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై కేసీఆర్ సమరశంఖం

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా నుంచే సమరం పూరించాలని చూస్తున్నట్లుగా తెలుస్తోంది. శుక్రవారం ఎర్రవల్లిలోని తన నివాసంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల ముఖ్య నేతలతో ఆయన సుదీర్ఘంగా సమావేశమై పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేశారు. ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ నీటి కేటాయింపు లకు అంగీకరించడం ద్వారా దక్షిణ తెలంగాణ రైతాంగానికి తీరని అన్యాయం చేస్తోందని కేసీఆర్ మండిపడ్డారు. ఈ అన్యాయాన్ని ఎండగట్టడమే కాకుండా, క్షేత్రస్థాయిలో రైతులను చైతన్యపరచడానికి మూడు ఉమ్మడి జిల్లాల్లో మూడు భారీ బహిరంగ సభలను నిర్వహించాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పరిగిలో ఒక సభను, నల్గొండ జిల్లాలోని దేవరకొండ లేదా కొండమల్లేపల్లిలో రెండో సభను, మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యంత భారీ స్థాయిలో మూడో సభను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ బహిరంగ సభలను ప్రారంభించాలని కేసీఆర్ నేతలకు దిశానిర్దేశర చేశారు. సంక్రాంతి పండుగ కంటే ముందే ఒక సభను నిర్వహించి, పండుగ తర్వాత మిగిలిన రెండు సభలను పూర్తి చేయాలా? లేక మూడు సభలను సంక్రాంతి తర్వాతే వరుసగా నిర్వహిం చాలా అనే అంశంపై తేదీలను త్వంలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ముఖ్యంగా ఈ మూడు సభలకు కేసీఆర్ స్వయంగా హాజరై ప్రసంగించబోతుండటంతో అటు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. పదేళ్ల తమ పాలనలో చేసిన అభివృద్ధిని, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పోలుస్తూ ప్రజల్లోకి వెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో



వెనకడుగు వేయకూడదని ఆయన నేతలకు స్పష్టం చేశారు. ఈ సభల ద్వారా దక్షిణ తెలంగాణలో బీఆర్ఎస్ తన పట్టును తిరిగి నిరూపించుకోవాలని చూస్తోంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

**హైదరాబాద్, డిసెంబర్ 26:** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో భాగంగా ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, 'ఆరా' పోల్ స్ట్రాటజీస్ సంస్థ వ్యవస్థాపకుడు ఆరా మస్తాన్‌ను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం శుక్రవారం విచారించింది. ఇప్పటికే రెండు సార్లు పోలీసులు ఆరా మస్తాన్‌ను ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఈసారి విచారణలో భాగంగా ఆయన గతంలో ఇచ్చిన స్టేట్‌మెంట్లను తిరిగి పరిశీలించి, కన్ఫర్మేషన్ కోసం అదే ప్రశ్నలను మరోసారి అడిగినట్లు తెలుస్తోంది. సిట్ అధికారులు 2020 సంవత్సరం నుంచి ఆరా మస్తాన్ వివిధ కీలక రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులతో మాట్లాడిన ఫోన్ కాల్స్ రికార్డింగ్స్‌ను సమగ్రంగా పరిశీలించారు. సిట్ అధికారుల విచారణ అనంతరం ఆరా మస్తాన్ మీడియాతో మాట్లాడారు. నూతనంగా ఏర్పాటు చేసిన సిట్ తనను ఈరోజు విచారణకు రావాలని పిలిచిందని అన్నారు. అధికారుల పిలుపు మేరకే తాను హాజరయ్యానని తెలిపారు. గతంలో అడిగిన ప్రశ్నలనే మరోసారి అడిగి, తన వాంగ్మూలాన్ని నిర్ధారించు కున్నారని వెల్లడించారు. సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు తాను స్పష్టమైన సమాధానాలు ఇచ్చానని చెప్పుకొచ్చారు. నూతనంగా ఏర్పాటు చేసిన సిట్ ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసిందని ఆరా మస్తాన్ అభిప్రాయపడ్డారు. గతంతో పోలిస్తే ఇప్పుడు విచారణ మరింత సమగ్రంగా, స్పష్టంగా కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. నూతన సిట్ దర్యాప్తు ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ కేసు త్వరలోనే ఒక స్పష్టమైన దశకు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని సిట్ అధికారులు తనకు చెప్పారని అన్నారు. తాను చట్టపరమైన పక్రియలకు పూర్తిగా సహకరిస్తానని, నిజాలు బయటకు రావాలన్నదే తన ఆకాంక్ష అని ఆరా మస్తాన్ స్పష్టం చేశారు.ఈ కేసులో సిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తోండటంతో రానున్న రోజుల్లో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని రాజకీయ, న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది ఫలితం రాష్ట్ర రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# జీహెచ్ఎంసీ పునర్విభజన ప్రక్రియ పూర్తి

## డీలిమిటేషన్‌కు తుది నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 26: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాలనా యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అత్యంత కీలకమైన పునర్విభజన ప్రక్రియను పూర్తి చేసింది. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా పౌర సేవలను వేగవంతం చేసే ఉద్దేశంతో జిహెచ్ఎంసి డీలిమిటేషన్‌కు సంబంధించి ప్రభుత్వం తుది నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నూతన సంస్కరణల ప్రకారం భాగ్యనగరంలో ప్రస్తుతం ఉన్న 150 డివిజన్ల సంఖ్యను ఏకంగా 300కు పెంచుతూ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. కేవలం డివిజన్ల సంఖ్యనే కాకుండా, పాలనా సౌలభ్యం కోసం ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 12కు , 30 సర్కిళ్లను 60కి పెంచుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మార్పుల వల్ల ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజగిరి, శంషాబాద్, గోల్కొండ , రాజేంద్రనగర్ ప్రాంతాలు కొత్త జోన్లుగా ఏర్పడ్డాయి. ఈ ప్రక్రియలో భాగంగా వార్డు స్థాయి కార్యాలయాల్లో కొత్త సర్కిల్ కార్యాలయాలు, ప్రస్తుత సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ఈ పునర్విభజన పక్రియ అత్యంత పారదర్శకంగా సాగిందని, ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత ప్రజల నుండి సుమారు 6,000కు పైగా అభ్యంతరాలు రాగా, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే ఈ తుది నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. నూతనంగా ఏర్పాటైన 12 జోన్లకు పాలనా సారథులుగా ప్రభుత్వం సమర్థులైన అధికారులను కమిషనర్లుగా నియమించింది. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా హేమంత్ సహదేవరావు, కూకట్‌పల్లికి అపూర్వ చౌహాన్, కుత్బుల్లాపూర్‌కు సందీప్ సుల్తానియా బాధ్యతలు స్వీకరించనున్నారు. అదేవిధంగా చార్మినార్ జోన్‌కు ఎస్. శ్రీనివాస్ రెడ్డి, మల్కాజగిరికి సంచిత్ గంగ్వార్, ఎల్బీ నగర్‌కు హేమంత్ కేశవ్ పాటిల్ నియమితులయ్యారు. ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా రాధిక గుప్త, సికింద్రాబాద్‌కు రవికిరణ్, గోల్కొండ జోన్‌కు ముకుంద రెడ్డిను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విప్లవాత్మక మార్పుల ద్వారా నగర పాలన నేరుగా ప్రజల ముంగిటకే వెళ్తుందని, మౌలిక సదుపాయాల కల్పన ,ల పరిష్కారంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వేగం పుంజుకుంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మా అయ్య మొగోడు.. తెలంగాణ తెచ్చిన మొనగాడు

- మా అయ్య పేరు బరాబర్ చెప్పుకుంటా
- రేవంత్ రెడ్డి చిట్టినాయుడు కాదు.. భీమవరం బుల్లోడు
- దమ్ముంటే ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ నేర్చుకో
- ఢిల్లీకి సంచులు మోసి పదవి కాపాడుకోవడం కాదు
- ఇచ్చిన హామీలను అమలు చేసి చూపాలి
- బిఆర్ఎస్‌లో ఉంటే అరికెపూడి ఎక్కడికి పోయినట్లు
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్



**హైదరాబాద్, డిసెంబర్ 26:** కేసీఆర్ ఒక్క ప్రెస్‌మీట్‌కు సీఎం రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇక కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ రెడ్డి గుండె ఆగి చస్తాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు దోసల అనిల్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మా అయ్య మొగోడు.. తెలంగాణ తెచ్చిన మొనగాడు అని కేటీఆర్ అన్నారు. మా అయ్య పేరు బరాబర్ చెప్పుకుంటానని స్పష్టం చేశారు. నీ లెక్క సంచులు మోసుకుంటే నీ పిల్లలు చెప్పుకోరు అని విమర్శించారు. రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో ఎమ్మెల్యేగా గెలవకుండా చేసే బాధ్యత మాది అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి భాషను చూస్తే పిల్లలు నేర్చుకునే పరిస్థితి ఉందని అన్నారు. నేను గుంటూరులో చదువుకుంటే నీకేం బాధరా అని ప్రశ్నించారు. నేను హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాష నేర్చుకున్నా.... నువ్వు కూడా నేర్చుకో అని అన్నారు. నేను గుంటూరులో ఇంటర్ చదువుకున్నా.. నీ అల్లుడు ఆంధ్రోడే కదా అని ప్రశ్నించారు. ఇక చిట్టినాయుడు కాదు.. భీమవరం బుల్లోడు అని ఎద్దేవా చేశారు. పాలమూరు ? రంగారెడ్డి డీపీఆర్‌ను వెనక్కి పంపితే ఏం చేస్తున్నావని కేసీఆర్ అడిగారని తెలిపారు. 10 శాతం పనులు పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలని అడిగారని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని అడిగారు.. అందులో తప్పేముందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే రేవంత్ రెడ్డికి కోపమొస్తుందని అన్నారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలకు ముందు కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డల పెళ్లికి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని సోనియాగాంధీ మీద రేవంత్ రెడ్డి ఒట్టువేశాడని తెలిపారు. మహిళలకు రూ.2500 ఇస్తానని ప్రియాంక గాంధీ మీద ఒట్టు వేశాడని గుర్తుచేశారు. ఇవన్నీ ఎగవేసి.. ఇప్పుడు కోటి మంది మహిళలకు కోటీశ్వర్లను చేస్తానంటున్నాడని మండిపడ్డారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలంటే బ్జడెట్ సరిపోతుందా అని ప్రశ్నించారు. బ్యాగులు మోసి జైలుకెళ్లి.. పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యాడని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ సెటైర్లు వేశారు. ఢిల్లీకి సంచులు మోసి పదవులు కాపాడుకుంటున్నాడని ఆరోపించారు. మహిళలకు ఇస్తానన్న రూ.2500 ఎక్కడపోయాయని అడిగితే నీ గుడ్లు పీకి గోటీలు ఆడుకుంటా అంటున్నాడని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వమంటే నీ లాగుల తొండలు ఇడుస్తా అంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను తిట్టాలనుకుంటే మూడు భాషల్లో పొల్లుపొల్లు తిడతానని స్పష్టం చేశారు. కొడంగల్‌లో రేవంత్ రెడ్డి ఇష్టారీతిన మొరుగుతున్నాడని అన్నారు. అమ్మ గీతమ్మ రేవంత్ రెడ్డిని కట్టేయ్.. లేదంటే ఎవరినన్న కరిచేలా ఉన్నాడని విమర్శించారు. కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రాకుండా చేస్తానని రేవంత్ రెడ్డి శపథం చేస్తున్నాడని తెలిపారు. జనవరి 1 నుంచి మహిళలకు రూ.2500 ఇస్తానని శపథం చేయాలని రేవంత్ రెడ్డికి సూచించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌లోనే ఉంటే.. అనిల్ రెడ్డి పార్టీలో చేరినప్పుడు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దమ్ముంటే రాజీనామా చేసి ఉప ఎన్నికకు రావాలని అరికెపూడి గాంధీకి సవాలు విసిరారు. ఎమ్మెల్యే పేరులో గాంధీ మాత్రమే ఉందని.. కానీ చేసేది భూకబ్జాలు అని విమర్శించారు. అల్విన్ కాలనీలో సమావేశం పెడతామంటే ఫంక్షన్ హాలు యజమాని బెదిరించాడని తెలిపారు. హైదరాబాద్ చరిత్రలో ఎవరితో సంబంధం లేకుండా బీఆర్ఎస్‌కు జీహెచ్ఎంసీ కార్పొరేషన్‌ను అప్పజెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని 23 ఎమ్మెల్యేలను గెలిపించారని అన్నారు. హైదరాబాద్ వాసులందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌కు పట్టం కట్టారని తెలిపారు. 40శాతం సర్పంచ్‌లను బీఆర్ఎస్‌కు ఇచ్చారని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సరైన నాయకులకు అవకాశమిస్తామని కేటీఆర్ తెలిపారు. స్థానిక నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంతో కొట్లాడి పనులు చేయిస్తామని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు గెలిస్తే కార్పొరేషన్ నిధులతో అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేస్తారంటా అని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌ను ఎన్ని ముక్కలు చేసినా ఓట్లు వేసేది ప్రజలే అని అన్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకు భూకబ్జాలు చేస్తున్నాడని కేటీఆర్ అన్నారు. మంత్రి కొడుకుపై కేసు పెట్టిన అబీబుల్లాఖాన్‌ను బదిలీ చేశారని తెలిపారు. గన్ పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ కూతురే స్వయంగా చెప్పిందని గుర్తుచేశారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం పోరాటం

- లోపభూయిష్టమైన జీవో 252ను తక్షణమే ఉపసంహరించాల్సిందే
- మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ
- రేపు రాష్ట్ర వ్యాప్త నిరసనలకు టీయూడబ్ల్యూజే పిలుపు




**హైదరాబాద్ :** జర్నలిస్టుల అక్రెడిటేషన్ పాలసీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీవో నం. 252ను వ్యతిరేకిస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( టీయూడబ్ల్యూజే, టీజేఎఫ్) శనివారం రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపుని చ్చింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ మాట్లాడుతూ కొత్త జీవో ద్వారా డెస్క్ జర్నలిస్టుల అక్రెడిటేషన్లను రద్దు చేయడం, కార్డుల సంఖ్యలో భారీగా కోత విధించడం జర్నలిస్టుల హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు గత ప్రభుత్వం జీవో 239 ద్వారా కల్పించిన ప్రయోజనాలను ఈ ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమని, డెస్క్ జర్నలిస్టులను రెండవ శ్రేణి పౌరులుగా చూడటం సరికాదని ఆయన విమర్శించారు. వార్తను సేకరించే ఫీల్డ్ జర్నలిస్టులది ఎంత కీలక పాత్రో, ఆ వార్తను తీర్చిదిద్దే డెస్క్ జర్నలిస్టులది కూడా అంతే కీలక పాత్ర అని అల్లం నారాయణ గుర్తు చేశారు. గతంలో 33 శాతం మహిళా జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, కల్చరల్, స్పోర్ట్స్, కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు కూడా అక్రెడిటేషన్లు ఇచ్చామని, నేడు వాటన్నింటికీ గండి కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం మీడియా కార్డుల పేరుతో జర్నలిస్టుల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే సహించేది లేదని, అక్రెడిటేషన్ల కుదింపు జర్నలిస్టు వృత్తికే తీరని నష్టమని హెచ్చరించారు. లోపభూయిష్టమైన జీవో 252ను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ పెద్ద పత్రికలు, శాటిలైట్ ఛానళ్ల కార్డులలో సగానికి సగం కోత విధించారని, ఫ్రీలాన్స్ జర్నలిస్టుల అర్హతను 10 నుండి 15 ఏళ్లకు పెంచడం దుర్మార్గమని పేర్కొన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టరేట్ల ముందు చేపట్టే నిరసన కార్యక్రమాల్లో జర్నలిస్టులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నేతలు రమేశ్ హజారి, యోగానంద్, రమణ కుమార్, అవ్వారి భాస్కర్, నవీన్ కుమార్ మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# కొత్త జీఓతో జర్నలిస్టులకు ఎలాంటి నష్టం జరగదు

**నూతన జీఓపై పనిగట్టుకొని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు**

**తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్ :** ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన అక్రెడిటేషన్ మార్గదర్శకాలు వృత్తిపరమైన జర్నలిస్టులను నష్టపర్చవని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సంక్షేమ చర్యలు ఎలాంటి వివక్షత లేకుండా అందరికీ వర్తించడంతో పాటు ఇంకా మెరుగైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటి యోచిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వపు అక్రెడిటేషన్ ఉత్తర్వులు ఉర్దూ జర్నలిస్టుల పట్ల అనుసరించిన వివక్షతను, చిన్న పత్రికల పట్ల చూపిన చిన్న చూపును తెలంగాణ హైకోర్టు కొట్టి వేసిన అంశాలను ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే వాటిని కొత్త జీఓలో మార్పు చేసిన విషయాన్ని వెల్లడించారు. నూతన జీఓపై కొందరు ఉద్దేశ్యపూర్వకంగా అవాస్తవాలను వెల్లడిస్తూ, వక్రీకరిస్తూ సంక్షేమ చర్యలు విలేకరులకు మాత్రమే వర్తిస్తాయని చెబుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేసారు. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. వృత్తిపరమైన జర్నలిస్టులందరికీ ఇవి వర్తిస్తాయని ఆయన స్పష్టం చేసారు. ఈ విషయాలపై అవసరమైతే వివరణ కొరవచ్చని ఆయన సూచించారు. ఇందుకు విరుద్ధంగాఓ రాజకీయ ఎత్తుగడతో కొన్ని శక్తులు ఆందోళన చేయాలని తలపెట్టడం అత్యంత విచారకరమని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల పట్ల, వారి సమస్యల పట్ల రేవంత్ రెడ్డి నాయకత్వాన ఉన్న ప్రజా ప్రభుత్వం సానుకూల పరిష్కారానికి వెళ్తుంది తప్పా, గత ప్రభుత్వం మాదిరిగా వివక్షత చూపే అవకాశమే లేదని ఆయన తెలిపారు.

# కోకాపేట గౌడ భవనం నిర్మించాలి

**మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**హైదరాబాద్, డిసెంబర్ 26:** కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గౌడ కులస్తుల కోసం కోకాపేటలో 5 కోట్ల రూపాయలతో కేటాయించిన 5 ఎకరాల స్థలంలో ప్రభుత్వం వెంటనే గౌడ భవనాన్ని నిర్ణించాలని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా)ఆధ్వర్యంలో గోపా స్వర్ణోత్సవాలను కాచిగూడ మున్నూరుకాపు సంఘం మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ అధ్యక్షుడు మహేకుమార్‌గౌడ్, శాషనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, జస్టిస్ ఈశ్వరయ్య హాజరయ్యారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులు అర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో వైన్ షాపులలో 10 శాతం రిజర్వేషన్లు కేటాయించామన్నారు. కులవృత్తి ఆత్మగౌరవం పెంపొందించడం కోసం ట్యాంక్ బండ్‌పై నీరా కేఫ్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం వీటిని పట్టించుకోక పోవడంతో మరుగున పడుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మిాసీ కమిాషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, చక్రవర్తి, అంబాల నారాయణగౌడ్, కిషోర్‌గౌడ్, పల్లె రవి, బాల్‌రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 42శాతం రిజర్వేషన్లతో
# ఎన్నికలు నిర్వహించండి

- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై సీఎంకు ఆర్. కృష్ణయ్య లేఖ



**హైదరాబాద్, డిసెంబర్ 26:** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను బీసీలకు 42శాతం రిజర్వేషన్లతోనే నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బీసీ భవన్‌లో ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చేసిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థలలో అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఇటీవల జరిగిన సర్పంచి ఎన్నికల్లో ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందన్నారు. రాబోయే ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు చేసిన తర్వాత నిర్వహించాలని కోరారు. అలా చేయకుండా ఎన్నికలకు వెళితే జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున పెద్దఎత్తున బీసీ ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డిసి ప్రకారం స్థానిక సంస్థలలోని బీసీ రిజర్వేషన్ పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. బీసీలకు ఇచ్చిన హామీని సీఎం అమలు చేసి మాట నిలుపుకోవాలని, లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఎప్పటికైనా సొంతింటికి వెళ్లాల్సిందే

**ఢిల్లీ నాయకత్వం పిలుపుకోసం ఎదురు చూస్తున్నా**

**గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్**



**హైదరాబాద్, డిసెంబర్ 26:** ఎమ్మెల్యే రాజాసింగ్ మళ్లీ వార్తల్లోకి వచ్చారు. ఎప్పికైనా సొంతింటికి వెళ్లక తప్పదని చెప్పారు. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉండి, ఒక అన్నయ్య గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోతే.. ఏదో ఒక రోజు అతను ఇంటికి తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. అలాగే తాను కూడా ఈ రోజు కాకపోయినా రేపైనా తన ఇంటికి తిరిగి వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అయితే ఆ శుభ సమయం ఎప్పుడు వస్తుందో చెప్పలేనంటూ దాటవేశారు. తాను బీజేపీకినిజమైన సైనికుడిని అని తెలిపారు. ఢిల్లీ లేదా రాష్ట్ర నాయకులు తనను పిలిచిన రోజున తిరిగి పార్టీలోకి వస్తానని తేల్చి చెప్పారు. ఇంతకు ముందు కూడా తాను ఇదే అభ్యర్థన చేశానని.. ఇప్పుడు కూడా అదే అభ్యర్థన చేస్తున్నానని చెప్పారు. అసెంబ్లీలో స్వేచ్ఛ కల్పించాలని, ప్రతి ఎమ్మెల్యే, ప్రతి ఎంపీకి వారి నియోజకవర్గంలో స్వేచ్ఛ ఇవ్వాలని.. అప్పుడే బీజేపీ భవిష్యత్తులో అధికారంలోకి రాగలదని రాజాసింగ్ అన్నారు. ఈరోజు కాకపోయినా రేపైనా తనకు ఢిల్లీ పెద్దల నుండి లేదా రాష్ట్ర పెద్దల నుంచి పిలుపు వస్తుందని ఖచ్చితంగా తెలుసని చెప్పారు. వారి నుంచి ఫోన్ వస్తే.. తాను ఒకటే ఒక రిక్వెస్ట్ చేస్తానని అన్నారు. తమకు పార్టీ పెద్ద నాయకులు నుంచి స్వేచ్ఛ ఇవ్వండి అని కోరతానని చెప్పారు. అలా స్వేచ్ఛ ఇచ్చిన తర్వాత.. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలతో తాము ఏ విధంగా యుద్ధం చేస్తామో అంతా చూస్తారని రాజాసింగ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ కొంతకాలం క్రితం బీజేపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన ఏ పార్టీలో చేరకుండా ఒంటరిగానే ఉన్నారు. అయితే ఇటీవల ఆయన తిరిగి మళ్లీ బీజేపీలో చేరతారంటూ ఊహాగానాలు వస్తున్నాయి. ఈ విషయమై ఆయన..పార్టీ అగ్రనేతలతో చేసిన చర్చలు సఫలమైనట్లు కూడా తెలుస్తోంది. నెల రోజుల్లో ఆయన కాషాయ కండువా కప్పుకోవచ్చనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజాసింగ్ వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి.

# బీఆర్ఎస్ పార్టీ టైర్ పంక్చర్ అయ్యింది

**గజ్వేల్ నియోజకవర్గంలోనే సర్పంచ్‌లు గెలవలేదు**

**కెఇఆర్‌కు అందుకే గుబులు పట్టుకుంది**

**మంత్రి వివేక్ వెంకటస్వామి ఎద్దేవా**



**మెదక్, డిసెంబర్ 26:** బీఆర్ఎస్ పార్టీ టైర్ పంక్చర్ అయ్యిందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. అందుకే కేసీఆర్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మెదక్ జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి.. గజ్వేల్ లో తొంబైకి పైగా స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు సర్పంచులుగా గెలిచారని అన్నారు. దీంతో కేసీఆర్ గుండెల్లో గుబులు మొదలైందని ఎద్దేవా చేశారు. ఓటమిని భరించలేక తోలు తీస్తా అని కాంగ్రెస్ పార్టీ మీద విమర్శలకు దిగుతున్నారని అన్నారు. కేసీఆర్ తనను గెలిపించిన గజ్వేల్ ప్రజల సమస్యలు పట్టించుకోలేదు కానీ తోలు తీస్తాడంట. గతానికంటే ఎక్కువగా దుబ్బాక లో 56 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచిందని అన్నారు. సిద్దిపేటలో సర్పంచ్ క్యాండిడేట్ దొరకడమే కష్టంగా ఉండేది.. కానీ ఇప్పుడు ప్రతి స్థానంలో అభ్యర్థిని పెట్టాం కొన్ని గెలిచాం అన్నారు. కార్యకర్తల కష్టం వల్లే ఇన్ని స్థానాలు గెలుపొందాం అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పథకాలపై ప్రజలలో మంచి స్పందన ఉందన్నారు. పార్టీ శ్రేణులు ప్రజల్లో ఉండి వారి కష్టాలు, సమస్యలు తెలుసుకోండి. అప్పుడే నాయకుడికి ప్రజలకు మధ్య బాండింగ్ ఏర్పడుతుందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు ఎక్కువ నిధులు , ఎక్కువగా ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వమని ముఖ్యమంత్రి కోరానని అన్నారు. జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కు బలం లేదు అన్నారు.. ఇరవై వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందాం. గెలిచిన సర్పంచులందరినీ ముఖ్యమంత్రితో కలిపిస్తా.. మీ శ్రమ గొప్పది.. కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ సర్పంచ్ ఎన్నికల్లో చూపించారని వారిని అభినందించారు.



సంపాదకీయం

# ఆరావళికి విజయోస్తు !

ఆరావళిపై సాగుతున్న అరాచకంపై ప్రజలు మేల్కొని ఉద్యమబాట పట్టడంతో కథ అడ్డం తిరిగింది. అంటే ప్రజా ఉద్యమాలకు బలం ఉందని తేలింది. ప్రజా ఉద్యమాలను న్యాయస్థానాలు సైతం అంగీకరిస్తున్నాయి. అందువల్ల సమస్యలపై ముఖ్యంగా పర్యావరణ సమస్యలపై పోరాటం చేయాల్సిందేనని ఆరావాళి మనకు హెచ్చరించింది. ఇది ఆరంభంగా తీసుకోవాలి. దేశంలో ఎక్కడిక్కడ ప్రజలు దేశ పర్యావరణ విధ్వంసంపై ఉద్యమించాలి. నదుల అనుసంధనం ద్వారా నీటి వృధాను అరికట్టేందుకు నడుం బిగించాలి. క్యాన్సర్ కారక పరిశ్రమలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. అన్నింటికి మించి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం అవసరం. ఇదంతా ఎందుకు చర్చించుకోవాలంటే ఆరావళిని కార్పోరేట్లకు ధారాదత్తం చేయాలన్న ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సుప్రీం ఆదేశాలతో అక్కడ తవ్వకాలకు స్వస్తి పలికింది. సహజసిద్దంగా, భారత్‌కు రక్షణ గోడలా ఉన్న ఆరావళి పర్వతాల్లో తవ్వకాలకు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలు, ప్రజలు, మేధావులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ అనుకూల మీడియా సైతం వ్యతిరేకించడం విశేషం. ప్రజాందోళనలు అంతకంతకూ మృగ్యమైపోతున్న ప్రస్తుత కాలంలో ఉదయ్‌పూర్ నుంచి ఢిల్లీ దాకా ఉద్యమం రాజుకోవడం, పర్యావరణవేత్తలు, సామాన్య ప్రజలు అనే తేడా లేకుండా తమను కంటికి రెప్పలా కాపాడుతున్న ఆరావళిని కాపాడేందుకు నడుం బిగించారు. కార్పొరేట్ లాభాలు తాత్కాలికమైనవి. పర్యావరణ నష్టాలు శాశ్వతమైనవని గుర్తించారు. అందుకే ఆరావళి జోలికి రాకుండా ఉద్యమించారు. ఢిల్లీ కాలుష్యంలో ఊపిరిసలుపక అవస్థలు పడుతున్న కేంద్ర పెద్దలు అరావళిని తమ తాబేదార్లకు తెగనమ్మే దిశగా అడుగులు వేయడం విస్మయం కలిగించక మానదు. ఎందుకంటే ఇప్పటికీ ఢిల్లీ కాలుష్య నివారణపై కదలిక కానరావడం లేదు. కాలుష్యం మూలాలను కనిపెట్టడం లేదు. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేస్తున్నా, ప్రజలు ఆందోళన చెందుతున్నా కార్యాచరణ శూన్యం ఈ దశలో ఆరావళిపై జరిగిన పోరాటం గుర్తుకు తెచ్చుకోవాల్సిందే. ఆలస్యంగానైనా లెంపలు వేసుకుని అరావళి రక్షణపై, ముఖ్యంగా గనుల తవ్వకంపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఉత్తర్వులు జారీచేయడం ప్రజాభీష్టానికి లభించిన ఘనవిజయంగా చూడాలి. ప్రజల నిరంతర అప్రమత్తతే ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని నిరూపితం అయ్యింది. ర్యావరణ పరిరక్షణకూ అప్రమత్తతే రక్షణ కవచమని ఇప్పుడు ఆరావళి సాక్షిగా తేలిపోయింది. ఆరావళి పర్వతాలకు ప్రస్తుతానికైతే ముప్పు తప్పింది. కార్పొరేట్ గద్దలకు ప్రకృతి సంపదను దోచిపెట్టాలన్న దురాలోచన వెనుకపట్టు పట్టింది. ఎత్తు పేరుతో పర్యావరణాన్ని చిత్తు చేయాలన్న ఎత్తుగడ ప్రజాగ్రహం ముందు వీగిపోయింది. ఎడతెగని రైతుల పోరాటం ఫలితంగా కార్పొరేట్లకు సాగును కట్టుబానిసను చేయాలన్న పన్నాగం విఫలమై నల్లచట్టాలను వెనక్కి తీసుకున్నట్టే, దేశవ్యాప్తంగా రగులుతున్న ఆరావళి నిరసనలకు తలొగ్గి కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ వెనక్కి తగ్గింది. ఎక్కడో పర్వతాలు, అడవులు.. ఎవరు తవ్వుకుంటే మనకేమీ అనుకునే రోజులు కావివి. భూమి మీద ఉండే ప్రతి పుట్టా, చెరువూ దేనికవే పర్యావరణ వ్యవస్థలకు ఆయువుగా నిలిచి ప్రాణాధారాలుగా పనిచేస్తాయి. భూమి మీదున్న అతిపురాతన పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళికి ఉన్న ప్రాముఖ్యం తెలియంది కాదు. మన పురాణాలు, ఉపనిషత్తులు, వేదాల్లో దీని ప్రస్తావన ఉంది. మన దేశానికి ఉత్తరాన పెట్టని కోటగోడలా నిలుస్తున్న హిమాలయాల కంటే ఆరావళి పర్వతాలే పురాతనమైనవి. దాదాపు 700 కిలోమీటర్ల పొడవున్న ఈ పర్వతశ్రేణి మరో రకంగా రక్షణ దుర్గంలా నిలుస్తున్నది. పడమర నుంచి తూర్పు ప్రాంతాలకు వీచే వేడిగాలుల ప్రభావాన్ని తగ్గించి, థార్ ఎడారి విస్తరణకు లక్ష్మణరేఖలా నిలువడం దీని ప్రత్యేకత. రాజస్థాన్, హర్యానా, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాలను చల్లగా చూసే కొండదేవరగా ఆరావళిని చెప్పుకోవచ్చు. ఇక కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దేశ రాజధాని ఢిల్లీకి ఊపిరితిత్తుల్లాంటివని చెప్పకతప్పదు. అలాంటి ఆరావళిని కార్పొరేట్, రియల్ ఎస్టేట్ శక్తులు ఇప్పటికే మైనింగ్‌తో, చెట్ల నరికివేతతో చెరపట్టి చేయాల్సిన నష్టం చేస్తూనే ఉన్నాయి. మరోవైపు ప్రాజెక్టుల పేరిట ప్రభుత్వాలు వేల ఎకరాల అడవులను ధ్వంసం చేస్తున్నాయి. దీనిని అడ్డుకోవాల్సిన కేంద్రం మరింతగా దూకుడు పెంచి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని చూసింది. దీనివల్ల మనకు తీరని నష్టం అని తెలిసినా పట్టించుకోలేదు. ఆరావళిని అంగడి సరుకుగా మార్చేందుకు, గనుల తవ్వకానికి రాచబాట పరిచేందుకు మోదీ సర్కార్ చేసని ప్రయత్నాలపై దెబ్బపడింది. వంద మీటర్ల ఎత్తువరకు మాత్రమే తవ్వకాలు జరపొచ్చని, అంతకన్నా ఎత్తున్నవి మాత్రమే పర్వతాలుగా పరిగణించాలని వితండవాదం చేసింది. శాస్త్రీయ విధానంలో ఏది అడవి, ఏది కాదనేది తేల్చిచెప్పాల్సిన కేంద్రమే ఎత్తును బట్టి అనుమతులను నిర్ధారించడం ద్వారా పర్యావరణ విధ్వంసానికి తోవ వేసింది. ఎత్తును బట్టి ఆరావళి పర్వతాలకు నిర్వచనమిచ్చే విధానాన్ని సర్వోన్నత న్యాయస్థానం స్వయంగా నియమించిన కమిటీ కూడా తిరస్కరించింది. దాన్ని తోసిరాజని కోర్టు ముందు సలహాదారుగా ఆ ప్రతిపాదనే ఉంచి పక్కదారి పట్టించింది. అయితే ప్రజా ఉద్యమాన్ని కోర్టు కూడా పరిగణించింది. ఆరావాళి జోలికి వెళ్లవద్దని తేల్చింది. ఆయా రాష్ట్రాలకు సూచనలు చేసింది. ఇప్పుడు ఇదే స్ఫూర్తితో ఢిల్లీ కాలుష్యంపై ప్రజలు పోరాడాలి. అప్పుడే దేశానికి విముక్తి కలుగుతుంది. కాలుష్యంతో ఢిల్లీలో ఉండలేక పోతున్నానని కేంద్రమంత్రి నితిని గడ్కరీ స్వయంగా చెప్పడం చూస్తుంటే ఢిల్లీలో ఎంతటి దారుణ పరిస్థితులు ఉన్నాయో గమనించవచ్చు. అందువల్ల కేంద్రమే స్వయంగా రంగంలోకి దిగి రాజధానిని కాలుష్యం నుంచి బయటపడేసే మార్గాలను వెతకాలి.




# సాహస బాలలకు బాల పురస్కార్ అవార్డులు

**న్యూఢిల్లీ,డిసెంబర్ 26:** న్యూఢిల్లీ వేదికగా ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఢిల్లీలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిన్నారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ పురస్కారాలు ధైర్య సాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, ఇన్నోవేషన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు అనే 6 విభాగాల్లో సృజనాత్మకత చూపించిన వారికి అందించారు. అవార్డు గెలుచుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులకు రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. వారి సాహసాలు, విజ్ఞానం దేశానికి గర్వకారణం ఆమె ప్రశంసించారు. వయసుకు మించి ధైర్యసాహసాలు, ప్రతిభను ప్రదర్శించే చిన్నారులకు 'వీర్ బాల్ దివస్' సందర్భంగా ఏటా పురస్కారాలు అందిస్తారు. ఈ ఏడాది రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా బిహార్ చిన్నోడు వైభవ్ సూర్యవంశీ సహా పలువురు చిన్నారులు 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్'ను అందుకున్నారు. పురస్కార గ్రహీతల్లో ఒక్కొక్కరిది ఒక్కో కథ. వీరిలో వ్యోమప్రియ ప్రదర్శించిన సాహసం, శ్వాన్ సింగ్ ఉదారత పలువురి హృదయాలను కదిలించింది. కరెంట్ షాక్ నుంచి ఓ బాలుడిని కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన 8 ఏళ్ల చిన్నారి వ్యోమ ప్రియ తరపున ఆమె తల్లి అర్చనా శివరామకృష్ణన్ రాష్ట్రపతి నుంచి పురస్కారం స్వీకరించారు. ఈ సందర్భంగా కుమార్తెను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. 'నా కుమార్తె తరపున ఈ అవార్డు తీసుకుంటున్నా. అప్పుడు మా అమ్మాయికి ఎనిమిదేళ్లు. మా అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉన్న పిల్లల పార్క్‌లో మిగతా చిన్నారులతో కలిసి ఆడుకుంటోంది. అక్కడ అండర్‌గ్రౌండ్ కేబుల్‌పై ఏర్పాటు చేసిన స్లైడ్‌పై ఆడుకుంటున్న ఆరేళ్ల పిల్లాడు అకస్మాత్తుగా పడిపోయాడు. ఆ చిన్నారిని కాపాడదామని వెళ్లిన నా కూతురుకు కరెంట్ షాక్ తగిలింది. ఆ ఘటనలో మా ప్రియతో పాటు ఆ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. కేబుల్ దెబ్బతిని ఉండటంతో స్లైడ్‌కు షాక్ రావడమే అందుకు కారణమైంది. అంత చిన్న వయసులోనే ధైర్యం ప్రదర్శించిన నా బిడ్డ ఇప్పుడు నేరుగా వచ్చి ఈ అవార్డు తీసుకొని ఉంటే ఎంతో సంతోషించేవాళ్లం అంటూ అర్చనా ఉద్వేగభరితంగా చెప్పారు. 2024 మేలో తమిళనాడులోని కొయంబత్తూరులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఓ పదేళ్ల బాలుడు మన సైనికులకు బాసటగా నిలిచాడు. అడగకముందే వారికి మంచినీరు, పాలు, టీ, లస్సీ.. వంటివి అందిస్తూ తనవంతు సాయం చేశాడు. అతడే శ్వాన్ సింగ్. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ జిల్లాకు చెందిన ఆ బాలుడి ధైర్యసాహసాలు, ఉత్సాహానికి ప్రశంసించిన సైన్యం అతడి చదువుకయ్యే ఖర్చులు పూర్తిగా భరించేందుకు ముందుకొచ్చింది. ఈ క్రమంలో తాజాగా శ్వాన్ సింగ్‌ను ఇప్పుడు బాలల పురస్కారం వరించింది. ఈ అవార్డును తాను కలలో కూడా ఊహించలేదని చిన్నారి సంతోషం వ్యక్తంచేశాడు.

## • అవార్డులను అందచేసిన రాష్ట్రపతి

# ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం చీఫ్ జస్టిస్ ఆందోళన

## పర్యావరణవేత్తలే పరిష్కారం కనుగొనాలి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం ఉదయం కూడా గాలి నాణ్యత సూచిక ప్రమాదకర స్థాయిలో నమోదైంది. అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైగా నమోదయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాజధాని నగరంలో తీవ్ర కాలుష్యంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలుష్య సంక్షోభానికి పర్యావరణ నిపుణులు సమర్థవంతమైన పరిష్కారాన్ని కొనుగొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఓ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. 'ఢిల్లీని పీడిస్తున్న వాయు కాలుష్య సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ఉపశమనం కలిగించే విధానాల కంటే.. దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్యలు అవసరం. ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతున్న ఈ వాయు కాలుష్య సమస్యకు నిపుణులు పరిష్కారం కనుగొంటారని నాకు నమ్మకం ఉందని అన్నారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. శుక్రవారం ఉదయం రాజధాని నగరంలో గాలి నాణ్యత గణనీయంగా క్షీణించింది. ఉదయం 8 గంటల ప్రాంతంలో నగరంలో ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 305గా నమోదైంది. అత్యధికంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచిక 390గా నమోదైంది. బవానాలో 379, నరేలా ప్రాంతంలో 356, ఆర్కే పురంలో 320గా ఏక్యూఐ నమోదైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత మెరుగ్గా నమోదైంది. ఔ౼ఎ౼ ద్వారకలో 253, అరబిందో మార్గ్ (258), మందిర్ మార్గ్ (234), ఎఉఎ విమానాశ్రయం ౼3 (239)గా గాలి నాణ్యత నమోదైంది.



# హెచ్-1 వీసాల్లో జాప్యంతో తీవ్ర ఆందోళన

## సమస్యను అమెరికా దృష్టికి తీసుకుని వెళ్లాం

## విదేశాంగాశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి



**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** అమెరికా హెచ్-1బీ వీసా అపాయింట్‌మెంట్ల షెడ్యూలింగ్‌లో జరుగుతున్న విపరీతమైన జాప్యం, ఆకస్మిక రద్దులపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. వేలాది మంది భారతీయ నిపుణులు, విద్యార్థులు ఈ సమస్య వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అమెరికా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. ఢిల్లీ, వాషింగ్టన్‌లోని అమెరికా అధికారులతో ఈ విషయంపై చర్చించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా వీసా పక్రియలో నెలకొన్న అనిశ్చితి వల్ల భారతీయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా డిసెంబర్ 15 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల ప్రకారం.. వీసా దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ఖాతాలను పబ్లిక్ చేయాల్సి రావడం, క్షుణ్ణమైన తనిఖీల వల్ల పక్రియ నెమ్మదించింది. దీనివల్ల గతంలో కొన్ని వారాల్లో పూర్తయ్యే స్టాంపింగ్ ప్రక్రియ ఇప్పుడు ఏకంగా 2026 వరకు రీషెడ్యూల్ అవుతున్నాయి. ఈ జాప్యం వల్ల వందలాది మంది టెక్కీలు సెలవులపై భారత్‌కు వచ్చి, తిరిగి వెళ్లలేక ఇక్కడే చిక్కుకుపోయారు. కేవలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే కాకుండా వారి కుటుంబ సభ్యులు ఉన్నత చదువుల కోసం వెళ్లే విద్యార్థులు కూడా ఈ జాప్యం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. అనేక మందికి ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉండగా, విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా అయ్యే పరిస్థితి నెలకొంది. గూగుల్, ఆపిల్ వంటి దిగ్గజ సంస్థలు కూడా తమ భారతీయ ఉద్యోగులకు వీసా స్టాంపింగ్ లేనిదే ప్రయాణాలు చేయవద్దని ఇప్పటికే అంతర్గత హెచ్చరికలు జారీ చేశాయి. అమెరికా వీసా అపాయింట్‌మెంట్‌ల షెడ్యూలింగ్ లేదా రీషెడ్యూలింగ్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తమకు అనేక ఫిర్యాదులు వచ్చినట్లు భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ అంశం అమెరికా సార్వభౌమాధికార పరిధిలోనిదే అయినప్పటికీ.. తమ ఆందోళనలను అమెరికా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. కెనడాలో గుండెపోటు కారణంగా భారత సంతతి వ్యక్తి ఇటీవల ప్రాణాలు కోల్పోయిన ఘటనపైనా భారత్ స్పందించింది. ఆయన భారత సంతతి వ్యక్తే అయినప్పటికీ.. అతడికి కెనడా పౌరసత్వం ఉందని స్పష్టం చేసింది. ఆ విషయంలో కెనడా ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొంది. తీవ్ర ఛాతీనొప్పితో తన భర్తను ఆసుపత్రిలో చేర్పించినప్పటికీ చికిత్స కోసం దాదాపు ఎనిమిది గంటలు వేచిచూడాల్సి వచ్చిందని, చివరకు ప్రాణాలు కోల్పోయారని బాధితుడి భార్య నిహారికా శ్రీకుమార్ ఆరోపించిన విషయం తెలిసిందే.




# బ్రహ్మోస్ క్షిపణులకు ఎంతో డిమాండ్

## కేంద్రమంత్రి జితేంద్రసింగ్

**తిరుపతి, డిసెంబర్ 26:** దశాబ్ద కాలంగా స్టార్టప్‌లలో భారత్ దూసుకెళ్తోందని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ అన్నారు. స్పేస్ ఎకానమీలో 8వ స్థానానికి చేరుకున్నామని చెప్పారు. ఐటీ, టెలికాం రంగాల్లో పెట్టుబడులను సరళతరం చేసినట్లు వివరించారు. తిరుపతి భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 'గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 81వ ర్యాంక్ నుంచి 38వ ర్యాంక్‌కు చేరుకున్నాం. చంద్రుడిపై ప్రయోగాల్లో భారత్ ఘన విజయాలు సాధించింది. రక్షణరంగ ఎగుమతుల్లో గణనీయ వృద్ధి సాధించాం. మన బ్రహ్మోస్ క్షిపణులకు ఇప్పుడు ప్రపంచంలో ఎంతో డిమాండ్ ఉంది. ప్రపంచానికి కొవిడ్ వ్యాక్సిన్లు అత్యధికంగా ఎగుమతి చేసిన దేశం భారత్. శాస్త్ర, సాంకేతిక రంగాలకు మోదీ హయాంలో బ్జడెట్ పెరిగింది. అంతరిక్ష రంగంలో ప్రైవేటు పెట్టుబడులను కూడా ప్రోత్సహిస్తున్నాం. కీలక ఖనిజాల విషయంలో ప్రైవేటు సంస్థలకూ అనుమతి ఇస్తున్నాం 'అని జితేంద్రసింగ్ తెలిపారు.

# గుజరాత్‌లో స్వల్ప భూ ప్రకంపనలు



**గాంధీనగర్, డిసెంబర్ 26:** గుజరాత్‌లోని కచ్ జిల్లాలో భూ ప్రకంపనలు సంభవించాయి. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ ప్రకంపనలు వచ్చాయి. ఈ భూ ప్రకంపనల తీవ్రత రిక్టర స్కేలుపై 4.4 గా నమోదు అయింది. ఈ మేరకు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. ఈ భూ ప్రకంపల కేంద్రాన్ని గుర్తించినట్లు వివరించింది. 23.65 డిగ్రీల నార్త్ లాటిట్యూడ్, 70.23 ఈస్ట్ లాంగిట్యూడ్ మధ్య 10 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. ఈ భూ ప్రకంపనలు సంభవించిన వెంటనే ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ప్రకపంనల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదని ఉన్నతాధికారులు వివరించారు. మరోవైపు ఈ కచ్ జిల్లాలో తరచూ భూ ప్రకంపనలు సంభవిస్తున్న సంగతి తెలిసిందే. కానీ స్వల్ప భూ ప్రకంపనలతో ఇక్కడ భూకంపాలు సంభవిస్తున్నాయి. 2001లో గుజరాత్‌లో భారీ భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోగా.. లక్షలాది మంది గాయపడ్డారు. ఈ వరుస భూప్రకంపనల కారణంగా.. స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

# భారత్‌లో మేధకు కొదవ లేదు

మొదటి పేజీ తరువాయి

పురుషులు గొప్ప వారని మన పిల్లలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సూపర్ మ్యాన్, స్పైడర్ మ్యాన్ కంటే మన హనుమంతుడు బలవంతుడని వారికి చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందని నొక్కి చెప్పారు. బ్యాట్ మ్యాన్, ఐరన్ మ్యాన్ కంటే మహాభారతంలో అర్జునుడు మహాయోధుడని వారికి చెప్పాలన్నారు. కృష్ణుడు, మహాశివుడి మహాత్యాల గురించి పిల్లలకు వివరించాలని తెలిపారు చంద్రబాబు. శ్రీరాముడిని మించిన మర్యాద పురుషోత్తముడు లేడని వారికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. అవతార్ సినిమా కంటే మన మహాభారతం గొప్పదని మన పిల్లలకు చెప్పాల్సి ఉందని సూచించారు. కంసుడు లాంటి రాక్షసుల గురించి కూడా వారికి తెలియాల్సి ఉందన్నారు. అప్పుడే మన పిల్లలు మంచికి, చెడుకి మధ్య ఉన్న వ్యత్యాసం తెలుసుకోగలరని ఈ సందర్భంగా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మైథాలజీ గురించి అందరూ మరిచిపోయే సమయంలో ఎన్టీఆర్ పోషించిన పాత్రలో మళ్లీ విలువల గురించి సమాజానికి తెలియజేసిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాజకీయాల్లోనూ అదే స్థాయిలో విలువలు పాటించారన్నారు. దేశాభివృద్ధికి మాజీ ప్రధాని వాజ్‌పేయి గతంలో పునాదులు వేశారని.. ఇప్పుడు ప్రధాని మోదీ అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. భవిష్యత్తులో మనదేశం సూపర్ పవర్ కాబోతోందని చెప్పారు. మన దేశం, భారతీయత గురించి చర్చించేందుకు భారతీయ విజ్ఞాన సమ్మేళనం మంచి వేదికన్నారు. సంస్కృతి సంప్రదాయాలను నిలబెడుతూ.. దేశాభివృద్ధి కోసం ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ కృషి చేస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. మానసిక ఒత్తిడిని అధిగమించడంలో యోగాది కీలకపాత్ర అని చెప్పారు. యోగా ద్వారా భారతదేశం యూనివర్సల్ హెల్త్‌ను అందించిందన్నారు. జీరోను భారతీయులే కనిపెట్టారని గుర్తు చేశారు. చెస్ ఆట సైతం మనదేనని వివరించారు.



భారతీయ కుటుంబ జీవితం మన దేశంలో మాత్రమే ఉందన్నారు. ఇది భద్రతతో పాటు జీవితాల్లో వెలుగునిస్తోందని పేర్కొన్నారు. ప్రతి జంట ముగ్గురు పిల్లలను కనేలా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. సౌర, పవన విద్యుత్తుపై అధికంగా దృష్టి పెడుతున్నామని వివరించారు. ఆరు నెలల్లో క్వాంటమ్ కంప్యూటర్ అమరావతి నుంచి ఆపరేట్ చేయబోతున్నామని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారు చేయడానికీ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఏపీకి ఇప్పటికే గూగుల్ వచ్చిందని.. మైక్రోసాఫ్ట్ కూడా రావాలని చూస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇలా అనేక అంతర్జాతీయ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌కు రాబోతున్నాయని వివరించారు. ఇది దేశ అభ్యున్నతికి కూడా కారణమవుతోందన్నారు. టెక్నాలజీలో మనం ప్రపంచంలో ఎవరికి తక్కువ కాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 1991లో ఆర్థిక సంస్కరణల తర్వాత అత్యంత కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. మన దేశంలో ప్రధాని మోదీ నాయకత్వంలో స్థిరమైన ప్రభుత్వం ఉంది. 2038 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుంది. 2047 నాటికి ప్రపంచశక్తిగా ఆవిర్భవిస్తుంది. మన దేశం పేరు మార్మోగిపోతుంది. ఇప్పటికే ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులే ఉన్నారు. దశాబ్దకాలంగా చాలా దేశాల్లో జనాభా తగ్గుతుండగా.. భారత్‌లో మాత్రమే పెరుగుతోంది. తిరుపతిలో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ, అనంతపురంలో ఏరోస్పేస్ సిటీ, విశాఖలో మెడ్‌టెక్ పార్కు తీసుకొస్తున్నాం. ప్రపంచంలో అత్యధిక వేతనాలను భారతీయులు పొందుతున్నారు. గతంలో హైదరాబాద్ లో ఐటీని ప్రోత్సహించా. దీనితో ప్రపంచంలో తెలుగువారు ఎక్కువ వేతనాలు పొందుతున్నారు. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ప్రోత్సహిస్తున్నా. విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ వచ్చిందని సీఎం పేర్కొన్నారు.

## అంతర్ జ్ఞానమే అందరికీ శ్రీరామరక్ష

**తిరుపతి :** మనిషిలోని క్షమాగుణమే అతడిని ఉన్నత స్థితిలో నిలుపుతుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. భౌతిక అంశాల జ్ఞానాన్ని విజ్ఞానమని.. అంతర్ జ్ఞానాన్ని జ్ఞానమని అంటారని వివరించారు. విజ్ఞానంతో మాత్రమే కొట్టుకుపోకూడదని చెప్పారు. భారతీయ విజ్ఞాన సమ్మేళనం లక్ష్యం జ్ఞానమని.. దీనిని ప్రపంచంలోని అందరికీ దగ్గర చేయాల్సి ఉందన్నారు. శుక్రవారం తిరుపతిలోని సంస్కృతి యూనివర్సిటీలో నాలుగు రోజుల పాటు జరగనున్న భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్‌ను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, సీఎం చంద్రబాబు నాయుడితో కలిసి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రారంభించారు. అనంతరం ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మాట్లాడుతూ.. మనమంతా ఈ ప్రపంచానికి ఎంతో కొంత రుణపడి ఉన్నామన్నారు. మానసిక సంతృప్తి లేకపోతే ఎంత పొందినా సుఖం కలగదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వయంగా కర్తవ్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని మోహన్ భాగవత్ అన్నారు. విజ్ఞానశాస్త్రం, ధర్మశాస్త్రాల మధ్య వైరుధ్యమేమీ లేదని చెప్పారు. అనుభవంతో ఎంతో విజ్ఞానాన్ని సంపాదిస్తామన్నారు. 'సరైన మార్గంలో పయనిస్తే ఏదైనా సాధ్యమని స్వామి వివేకానంద వంటివారు బోధించారు. మార్గం సరైనదైతే లక్ష్యాన్ని కచ్చితంగా చేరగలం. ప్రపంచం వేగంగా ముందు కెళ్తోంది.. పోటీపడాలంటే సాధన అవసరం. విద్యతో పాటు క్రమశిక్షణ కూడా అలవడాలి. క్షమాగుణమే మనిషిని ఉన్నత స్థితిలో నిలుపుతుంది. మానసికంగా సంతృప్తి లేకపోతే ఎంతపొందినా సుఖం కలగదు. మనమంతా ఈ విశ్వానికి ఎంతోకొంత రుణపడి ఉంటాం' అని మోహన్ భాగవత్ అన్నారు. కొందరిలో ఎంత ఎదిగితే అంత అహంకారం పెరుగుతుందని చెప్పారు. ప్రపంచానికి భారత్ ఎంతో కొంత ఇవ్వాలన్నారు. మనుషులందరికీ సౌఖ్యం, సదుపాయాలు కావాలని చెప్పారు. సుఖమనేది కేవలం భౌతికపరమైనదని ఆయన అభివర్ణించారు. సుఖ దు:ఖాలు తాత్కాలికమైనవన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో అభివృద్ధితోపాటే వినాశనం సైతం వచ్చేసిందంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్ర విజ్ఞానంతోనే మానవాళికి సదుపాయాలు కలుగుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మనం పొందుతున్న వాటిలో రెండో కోణం కూడా ఉంటుందన్నారు. ఖచ్చితంగా ప్రపంచంలోనే భారత్ గొప్ప దేశం అవుతుందన్నారు. ప్రపంచంలో భారతదేశం ఉన్నత స్థితిలోకి రావడంతోపాటు.. ప్రపంచానికి మన దేశం ఏమి ఇవ్వగలమే అంశంపై దృష్టి పెట్టాలని ప్రజలకు ఆయన సూచించారు. సృష్టిలో ప్రతి ఒక్కరికీ సుఖం కావాలన్నారు. మనిషి సాధించే జ్ఞానంతో సుఖాన్ని సాధించాల్సి ఉందని ఆర్ఎస్ఎస్ చీఫ్ అభిప్రాయ పడ్డారు. ఆహారం, నిద్ర, మైథునం జంతువులకు ఆనందాన్ని ఇస్తాయని.. జంతువు కంటే మనిషి భిన్నమైన వాడని తెలిపారు. ఏ జంతువు ఆత్మహత్య చేసుకోదన్నారు. శరీరము, మనసు, బుద్ధి, ఆత్మ ఉన్నదని తెలిసిన వాడు మనిషని ఆయన తెలిపారు. భౌతిక అవసరాలు తీర్చుకోవడం మాత్రమే వికాసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజంలో సుఖంగా ఉన్నవాళ్లు దుఃఖంతో ఉన్నవారంటూ రెండు వర్గాలుగా తయారు కాకూడదని హితవు పలికారు. మనుషులంతా సుఖంగా ఉండాలని కోరుకోవాలని.. అహంకారంతో ఉండకూడదని ఆయన సూచించారు. ఎవరికి ఏ భాష వచ్చొ ఆ భాషను ప్రజలకు అందుబాటులోకి తీసుకుపోవాల్సి ఉందని తెలిపారు. అప్పుడే అందరిలో బుద్ధి వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భారతీయుల డీఎన్ఏలో మాత్రమే ధర్మ దృష్టి ఉందని ఆయన స్పష్టం చేశారు. భారత్ విశ్వ గురువు కావాలని ఆకాంక్షించారు. ఆర్థిక, సామాజిక, ధర్మ జ్ఞానాల్లో సంపూర్ణంగా మనం ప్రపంచానికి శక్తిని..దృష్టిని.. ఇవ్వాల్సి ఉందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తెలిపారు.

## రాజకీయ ముసుగులో రౌడీయిజం సహించం

**రప్పారప్పా అంటూ జంతుబలులు..రక్తాభిషేకాలా**

**ఇలాంటి దుర్మార్గాలను సహించబోం**

**జిల్లా పోలీస్ కార్యాలయం ప్రారంభంలో చంద్రబాబు**



**తిరుపతి :** హత్య చేసే వారికి పోస్ట్‌మార్టం తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గట్టిగా హెచ్చరిక ఇచ్చారు. శుక్రవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ ముసుగులో చేసే నేరాలు అంగీకరించేది లేదన్నా రు. పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైసీపీ హయాంలో మళ్ళీ రౌడీయిజం పెరిగిందని... అదే సరైనదని ఇంకా వాళ్ళు నమ్ముతున్నారని మండిపడ్డారు. రప్పా రప్పా... అని పోస్టర్‌లు వేసి బెదిరిస్తున్నారని ఫైర్ అయ్యారు. జంతువులను బలి ఇచ్చి, ఆ రక్తంతో పోస్టర్‌పై రక్తాభిషేకం చేయడం చూశానని.. ఇష్టారాజ్యంగా చేస్తే, ఎవరినీ వదిలి పెట్టను అంటూ హెచ్చరించారు. సోషల్ మీడియాలో కొందరు చెలరేగిపోతున్నారని.. దీన్ని అంగీకరించమని స్పష్టం చేశారు. అది ఆమోదయోగ్యం కాదన్నారు. కూటమి వాళ్ళు చేయరని.. తప్పు చేసిన వారు తప్పించుకోలేరని అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా అంతా అప్రమత్తంగా ఉండాలని.. టీటీడీ, పోలీసులు సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. తిరుపతిని నేరాలు లేని సిటీగా చూడాలని... తిరుపతి ఒక ఫ్యూచర్ సిటీ అంటూ వెల్లడించారు. ఇక్కడ నోరు పారేసుకున్న, ఇష్టారాజ్యంగా చేసినా వదిలిపెట్టనని వార్న్ చేశారు. ఇక్కడే పుట్టిన తనకు, ఇక్కడి అన్ని విషయాలు తెలుసన్నారు. తిరుపతి వేంకటేశ్వరస్వామి ఉండే ప్రాంతమని... ఈ ప్రాంత పవిత్రత కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఇక్కడ కుప్పిగంతులు వేయాలనుకున్నా వారి ఆటలు సాగవని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఆర్టీసీ మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులకు శుభవార్త

మొదటి పేజీ తరువాయి

ప్రత్యామ్నాయ ఉద్యోగాలిచ్చే విధానం ఉండదే. ఇకపై ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు, సహా మిగిలిన ఉద్యోగులందరికీ ప్రత్యామ్నాయ ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్పోరేషన్‌లో ఉండగా 21 కేటగిరీలో మెడికల్ అన్ ఫిట్ అయిన వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వనున్నారు. విలీనం తర్వాత కూడా 21 కేటగిరీల్లో మెడికల్ అన్ ఫిట్ అయిన వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలివ్వాలని సర్కార్ నిర్ణయించింది. మెడికల్ అన్ ఫిట్ అయిన వారికి కండక్టర్, రికార్డు ట్రేసర్, అసిస్టెంట్ మెకానిక్ /శ్రామిక్ ఉద్యోగాలివ్వాలని నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీలో ఇచ్చే ఉద్యోగానికి అర్హత లేకపోతే ప్రభుత్వ విభాగాల్లో అర్హత బట్టి ఉద్యోగాలివ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కలెక్టర్ల ద్వారా ప్రభుత్వ విభాగాల్లో అర్హత మేరకు ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏ ఉద్యోగానికీ అర్హత లేని వారికి అదనపు మానిటరీ ప్రయోజనాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. మెడికల్ అన్ ఫిట్ వల్ల వాలంటరీ రిటైర్డ్ అవ్వాలనుకునే వారికి అదనపు మానిటరీ ప్రయోజనాలు చేకూరేలా తదుపరి చర్యలు తీసుకోవాలని ఎపీపీటీడీ కమిషనర్‌కు ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇచ్చింది. అలాగే తదుపరి చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లా కలెక్టర్లకు సర్కార్ ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి .కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఆర్టీసీలో ఉద్యోగులందరికీ ప్రయోజనాలివ్వడంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగులందరికీ ప్రత్యామ్నాయ ఉద్యోగాలివ్వడంపై ఆనందం తెలుపుతున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆర్టీసీ ఎన్ఎంయూఏ నేతలతో పాటు ఆర్టీసీ ఈయూ, కార్మిక పరిషత్ నేతలు ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్యార్థులు సమాజాన్ని, దేశాన్ని లీడ్ చేయాలి

మొదటి పేజీ తరువాయి



చాలా కష్టపడి చదువుకున్నారని.. అన్ని ఉండి చదువుకునే వారిని కాకుండా పేదరికంలో ఉండి చదువుకునే వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శుక్రవారం నిమ్మకూరులో పర్యటించిన భువనమ్మ.. గురుకుల పాఠశాల్లో విద్యార్థులతో సమావేశం నిర్వహించి.. వారితో తన బాల్య స్మృతులను పంచుకున్నారు. స్కూల్ చదువు పూర్తి చేసుకుని బయటకు వచ్చే సమయంలో జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆంగ్లంలో ప్రతిభ కనబర్చేలా అధ్యాపకులు చూడాలన్నారు. తాను నిమ్మకూరు రావడం స్వీట్ మెమోరీ అని.. ఇది తన తాత లక్ష్మయ్య ఊరు అని తెలిపారు. చిన్నపుడు సెలవులు వస్తె అమ్మ తమను నిమ్మకూరుకు పంపేదని... వేసవి సెలవలకు ఇక్కడికే వచ్చే వాళ్ళమని చెప్పుకొచ్చారు. ఇక్కడ తన సోదరి శారద ఉండేదని.. ఆర్టీసీ బస్‌లో పామర్రు సినిమా వెళ్ళేవాళ్ళమంటూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కాలం మారుతుందని.. ఇప్పుడు ఫోన్, కార్లు కావాలని కోరుకుంటున్నారని అన్నారు. నాన్న ఇంటింటికీ తిరిగి పాలు అమ్మి కష్టపడి పైకి వచ్చారని.. తాము ఈ స్థాయిలో ఉన్నాము అంటే తమ తల్లిదండ్రుల కష్టమని గర్వంగా చెప్పుకున్నారు. సీఎం చంద్రబాబు కూడా చాలా కష్టపడి చదువుకున్నారని తెలిపారు. చంద్రబాబుపై నమ్మకంతో ఉమ్మడి రాష్ట్రంలో, విభజన తర్వాత సీఎంగా ఎన్నుకున్నారన్నారు. ఇంటింటికి రూ. 15 వేలు ఇస్తామన్నారని.. 54 లక్షల మంది తల్లులకు తల్లికి వందనం ఇస్తున్నారని.. ఇందుకోసం రూ. 10 వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఎంత సేవ చేయాలో అంత చేస్తున్నామన్నారు. తమను నమ్మి ఎంతోమంది దాతలు ముందుకు వస్తున్నారని అన్నారు. ఈరోజు ఇక్కడికి రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. స్కూల్స్‌లో ఉన్న సమస్యలను సీఎం, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని భువనేశ్వరి పేర్కొన్నారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. రూ. 6కోట్ల నాబార్డు నిధులతో నిర్మించనున్న 30 పడకల ఆస్పత్రికి ఆమె శంకుస్థాపన చేశారు. రూ. 3.5 కోట్లతో నిర్మించిన బాలుర వసతి గృహాన్ని భువనేశ్వరి ప్రారంభించారు.

## వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై మంత్రి ఆరా

**అమరావతి :** వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ప్రాజెక్ట్ సీఈ, ఎస్ఈ, ఈఈలు, ఏజెన్సీ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. '7 కి.మీ టన్నెల్-2 లైనింగ్ పనుల్లో నేటికి 3.2 కి.మీ పూర్తయ్యింది. డిసెంబర్‌లో 456 మీటర్ల లక్ష్యానికి గానూ,432 మీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేశాం. మిగిలిన 3.6 కి.మీ లైనింగ్ 2026 జూన్ కల్లా పూర్తి చేసేలా లక్ష్యం నిర్దేశిరచాం. టన్నెల్-2లో చిక్కుకొని ఉన్న టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగించడానికి నియమించిన కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. నివేదిక ప్రకారం టన్నెల్-2లో ఉన్న టీబీఎంను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వెంటనే మొదలుపెట్టి, సీజన్ ముగిసేలోగా పూర్తి చేయాలని అధికారులకు, ఏజెన్సీకి ఆదేశాలు ఇచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 2026 నాటికి వెలిగొండ పూర్తిచేయడమే లక్ష్యంగా పర్యవేక్షణ జరుగుతోంది' అని ఆయన అన్నారు.

## పరకామణి చోరీ కేసులో కీలక పరిణామం

**అమరావతి :** తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణిలో జరిగిన చోరీ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన నిందితుడు రవికుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులపై ఏసీబీ ఒక మధ్యంతర నివేదికను విడుదల చేసింది. ఈ నివేదికను ఏసీబీ డీజీ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సమర్పించారు. ఈ నివేదికను స్వీకరించిన ఏపీ హైకోర్టు, దానిని సవివరంగా పరిశీలించిన అనంతరం తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. అలాగే ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన అవసరం ఉందా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని సీఐడీకి న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. పరకామణిలో జరిగిన చోరీ వ్యవహారంపై హైకోర్టులో ఈరోజు విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు చాలా వరకు పూర్తి అయ్యిందని, అయితే కొన్ని అంశాలపై ఇంకా విచారణ మిగిలి ఉందని పేర్కొన్నారు. అలాగే సుప్రీంకోర్టు ఇచ్చిన గత తీర్పుల ప్రకారం, ఈ కేసులో పరిస్థితుల ఆధారంగా మరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన అవకాశం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశాన్ని కూడా సీఐడీ పరిశీలించాలని సూచించింది. కేసుకు సంబంధించిన తదుపరి విచారణను జనవరి 5వ తేదీకి ఏపీ హైకోర్టు వాయిదా వేసింది. అప్పటికి ఏసీబీ నివేదికపై పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఈ పరిణామాలతో టీటీడీ పరకామణి చోరీ కేసు మరింత కీలక మలుపు తిరగనుంది. రాబోయే రోజుల్లో చట్టపరంగా మరిన్ని నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది.

## రాష్ట్రంలో పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్సిపల్ పరిపాలన విభాగంలో కీలక బదిలీలు చోటుచేసుకున్నాయి. ఏపీ సర్కార్ మొత్తం 11 మంది మున్సిపల్ కమిషనర్లకు సంబంధించిన బదిలీలు, కొత్త పోస్టింగ్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కూటమి సర్కార్ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీలతో పలు పట్టణాల్లో పరిపాలనా మార్పులు అమల్లోకి వచ్చాయి. ఈ బదిలీలతో మున్సిపల్ పరిపాలనలో సమర్థత పెంచడం, పట్టణ అభివృద్ధి పనులను వేగవంతం చేయడం ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. వివిధ పట్టణాల్లో కొత్త అధికారుల నియామకంతో పరిపాలనా వ్యవస్థలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. కొత్త బదిలీల్లో భాగంగా పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా డి. పావనిని నియమించింది.. అనంతపురం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా ఎం. అంజయ్యకు పోస్టింగ్ ఇచ్చింది. తిరుపతి అదనపు మున్సిపల్ కమిషనర్‌గా యు. శారదాదేవిని నియమించింది. పెడన మున్సిపల్ కమిషనర్‌గా డి. కొండయ్య బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రొద్దుటూరు మున్సిపల్ సహాయ కమిషనర్‌గా ఎం. మంజునాథ్ గౌడ్‌ను నియమించింది. చీరాల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రషీద్‌ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో డేనియల్ జోషెఫ్‌ను చీరాల మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ ఎస్. బేబీని మత్స్యశాఖ రెవెన్యూ విభాగానికి కేటాయించింది. నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా జి. వెంకటరామిరెడ్డిని నియమించింది. కనిగిరి మున్సిపల్ కమిషనర్‌గా పి. శ్రీధర్‌ను నియమించింది. ప్రస్తుతం కనిగిరి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న పి. కృష్ణమోహన్ రెడ్డిని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ లో రిపోర్ట్ చేయాలని ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ కలెక్టర్

- పాపన్నపేట్ మండల కేంద్రంలోని
- పీ.హెచ్.సీ ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- ఆసుపత్రి లోని అన్ని విభాగాల పరిశీలన
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**పాపన్న పేట డిసెంబర్26( సమయం న్యూస్) :** పాపన్నపేట మండలం పీ. హెచ్.సీ ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్ సీ లోని రక్త పరీక్షల గది, మందులు అందజేసే గది, ఇన్ పేషెంట్ వార్డ్, బెడ్స్, టాయిలెట్స్, వాక్సినేషన్ ను పరిశీలించారు. ప్రతి రోజూ హాస్పిటల్ కు ఎంత మంది రోగులు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో ఎన్ని డెలివరీల లక్ష్యం ఉందని, ఇప్పటిదాకా ఎన్ని చేశారని సాధారణ ప్రసవాలపై ప్రత్యేక దృశ్య సారించాలని లక్ష్యాలను పూర్తి చేయాలని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని జిల్లాలో ఆరోగ్య సేవలు మరింత మెరుగుపడినాయని తెలిపారు. హాస్పిటల్ కు వచ్చే రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, వ్యక్తిగత , పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని సూచించారు. ఇక్కడ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న కొడువాటి సాయమ్మను పరామర్శించిన ఖాజీపూర్ నూతన సర్పంచ్ సాయిలు



**మద్దూరు మండలం,డిసెంబర్,26(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన కొడువాటి సాయమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఖాజీపూర్ గ్రామ సర్పంచ్ సాయిలు ఆమెను నారాయణపేట జిల్లా బాలాజీ హాస్పిటల్ లో పరామర్శించారు. ఈ సందర్భంగా సాయమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అవసరమైన వైద్య సహాయం అందించాలని వైద్యులకు మరియు కుటుంబ సభ్యులకు సూచించారు. గ్రామ ప్రజల ఆరోగ్యం తమ బాధ్యత అని పేర్కొంటూ, ఎల్లప్పుడూ గ్రామస్థులకు అండగా ఉంటామని సర్పంచ్ సాయిలు భరోసా ఇచ్చారు.

## యూత్ ఫర్ సేవా వారి సహకారంతో.. దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ..



**కొడంగల్ మండలం, డిసెంబర్,26(సమయం న్యూస్) :** యూత్ ఫర్ సేవా వారి సహకారంతో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని పాత కోడంగల్ గ్రామానికి చెందిన దివ్యాంగులైన భీమేష్ ఆశప్ప కు ట్రై సైకిల్లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ విద్యావంతుల వేదిక,నాయకులు రవీందర్ గౌడ్ బాకారం చంద్రశేఖర్ గౌరారం గోపాల్ , ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...యూత్ ఫర్ సేవా సహకారంతో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో 2009 నుండి విద్యావ్యవస్థలో అనేక కార్యక్రమాలు చేస్తూ వస్తున్నాం అదేవిధంగా రైతు ఆత్మహత్య కుటుంబాలకు సహకారాలు అందిస్తా ఉన్నాం ఆ నేపథ్యంలోనే పాట కోడంగల్ కు చెందినటువంటి ఆశప్ప భీమేషులకు ఐదు సంవత్సరాల క్రితం వారి ఇంటిని సందర్శించి వారి అవసరాల నిమిత్తం ఈ రోజు ఆర్థిక సహాయ సహకారన అందిస్తూ నిత్యవసర సరుకులను అందజేస్తూ వారు కదల లేనటువంటి స్థితిలో ఉన్నందున,జన్మనిచ్చిన తల్లిదండ్రులకు భారం కాకూడదని నేపథ్యంలో వారికి ట్రై సైకిలను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం కూడా ప్రభుత్వం కూడా ఇలాంటి దివ్యాంగులకు ఆర్థిక సాయంతో పాటు జీవనోపాధి కార్యక్రమాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాకారం చంద్రశేఖర్ జిల్లా కన్వీనర్ గౌరారం గోపాల్ ఎస్టీయూ ప్రధాన బాధ్యులు వేణుగోపాల్ అమ్మానాన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రవీణ్ బలబీమ సేన న్యూస్ నిర్వాహకులు నరేష్ కుమార్ మరియు పాత కోడంగల్ మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్,రాజశేఖర్ గ్రామ పెద్దలు మహిళాలు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్ర శాసనసభ నూతన కార్యదర్శిగా ఈరోజు పదవీ బాధ్యతలు స్వీకరించిన రేండ్ల తిరుపతి



**హైదరాబాద్ డిసెంబర్26( సమయం న్యూస్) :** శాసనసభ కార్యదర్శి ఛాంబర్ లో ప్రస్తుత లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహా చార్యులు గారి నుండి బాధ్యతలను స్వీకరించిన తిరుపతి గారు. అనంతరం అధికార నివాసంలో శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన కార్యదర్శి తిరుపతి గారు, మండలి కార్యదర్శి నరసింహా చార్యులు గారు. ఈసందర్భంగా శాసనసభ నూతన కార్యదర్శి తిరుపతి గారికి పుష్ప గుఛరే అందించి శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు. మండలి కార్యదర్శిగా వి. నరసింహా చార్యులు గారు కొనసాగుతారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి
- చెకుముకి సంబరాలు ప్రారంభం




**కరీంనగర్ డిసెంబర్26( సమయం న్యూస్).:** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, అందుకు చెకుముకి సంబరాలు, సైన్స్ ఫెయిర్ దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పద్మ నగర్ లోని పారమిత హెరిటేజ్ స్కూల్లో ఈనెల 26 నుండి 28 వరకు రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నారు శుక్రవారం ఈ సంబరాల ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ ప్రతి అంశాన్ని శాస్త్రీయ కోణంలో ఆలోచించాలని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్, చెకుముకి సంబరాలు వంటివి ఉపకరిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో ప్రజల్లో మూఢనమ్మకాలను చెరిపివేస్తూ సైన్స్ కోణంలో అవగాహన కల్పిస్తున్న జనవిజ్ఞాన వేదిక సేవలు అభినందనీయమని తెలిపారు. నిత్యజీవితంలో రోజువారి కార్యక్రమాన్నీ సైన్స్ తో ముడిపడి ఉన్నాయని అన్నారు. విద్యార్థులు ముఖ్యంగా గణితం, సైన్స్ సబ్జెక్టులపై దృష్టి పెట్టాలని అన్నారు. నేర్చుకున్న అంశాలను నిత్యజీవితంలో సైన్స్ కోణంలో పరిశీలించాలని సూచించారు. ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలిస్తూ తోటి విద్యార్థులతో చర్చించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు థియరీ పాఠాలతోపాటు ప్రాక్టికల్స్ పై దృష్టి సాధించాలని అన్నారు. అన్ని పాఠశాలల్లో సైన్స్ ప్రయోగశాలలను తప్పనిసరిగా ఉపయోగించాలని అన్నారు. మోడల్ స్కూల్ పిల్లలు సైన్స్ పట్ల చూపుతున్న ఉత్సాహం అభినందనీయమని, వారి ప్రయోగాలు, ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. పాఠశాలల్లో వివిధ అంశాల్లో విద్యార్థుల అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన క్లబ్స్ సభ్యులు మరింత మంది విద్యార్థులు రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. తాను గతంలో సైంటిస్ట్ గా పని చేసిన అనుకోని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు చెలిమెల రాజేశ్వర్, జెవివి రాష్ట్ర కార్యదర్శి పి.మనీంద్రం, సీసీఎంబి మాజీ డైరెక్టర్ మోహన్ రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ ప్రసాదరావు, పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు, చక్రపాణి, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జె వి వి వైస్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, జె వి వి నాయకులు ఆనంద్ కుమార్, వెంకటేశ్వరరావు, రామచంద్రయ్య, శ్రీకాంత్, వరప్రసాద్, అందే సత్యం, సిహెచ్ రామరాజు, ఆర్ వెంకటేశ్వరరావు, ఎన్ దేవేందర్, గంగారాం, శంకర్, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన 12 మంది జోనల్ అధికారులు







**హైదరాబాద్ 26, డిసెంబర్( సమయం న్యూస్) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 12కు పెంచుతూ తుది నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం 12 జోన్లకు జోనల్ కమిషనర్ లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం సంబంధిత అధికారులు జోనల్ కమిషనర్ లుగా బాధ్యతలు చేపట్టారు. జీహెచ్ఎంసీ కమిషనర్ సమక్షంలో

రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్గా అనురాగ్ జయంతి, గోల్కొండ జోనల్ కమిషనర్ గా జి ముకుందరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కూకట్ పల్లి జోనల్ కమిషనర్ గా అపూర్వ్ చౌహాన్, శంషాబాద్ జోనల్ కమిషనర్ గా కె. చంద్రకళ , ఉప్పల్ జోనల్ కమిషనర్ గా రాధికా గుప్తా, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్గా రవి కిరణ్ , ఖైరతాబాద్ జోనల్ కమిషనర్గా ప్రియాంక అల , మల్కాజ్ గిరి జోనల్ కమిషనర్గా సంచిత్ గంగ్వార్, శేరిలింగంపల్లి

జోనల్ కమిషనర్ గా బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, కుత్బుల్లా పూర్ జోనల్ కమిషనర్ గా సందీప్ కుమార్ ఝా, ఎల్ బి నగర్ జోనల్ కమిషనర్ గా హేమంత్ కేశవ్ పాటిల్, చార్మినార్ జోనల్ కమిషనర్ గా ఎస్ శ్రీనివాస్ రెడ్డి లు బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లను జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కరన్ అభినందించారు. జీహెచ్ఎంసీ వార్డులపునర్విభజనకు సంబంధించి తుది నోటిఫికేషన్ విడుదలజీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన సంబంధించి తుది నోటిఫికేషన్ ను గురువారం విడుదల అయ్యింది. వార్డుల సంఖ్యను 300కు పెంచుతూ నోటిఫికేషన్ జారీ అయింది. జీహెచ్ఎంసీ లో ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 12కు పెంచారు. ప్రస్తుతం 30 ఉన్న సర్కిళ్లను 60కి పెంచారు. జీహెచ్ఎంసీలో కొత్త జోన్లుగా ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్ ఏర్పడ్డాయి. సర్కిల్ కార్యాల యాల్లో కొత్త జోన్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. గోల్కొండ జోనల్ కమిషనర్ కార్యాలయంను అబిడ్స్ లో ఏర్పాటు చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో..జిల్లా ముందంజ

- సాకర మవుతున్న పేదల కలలు
- క్షేత్ర స్థాయి లో స్పష్టమైన పురోగతి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





**జనగాం డిసెంబర్26( సమయం న్యూస్). :** నిరుపేద లకు నిలువ నీడ కల్పించాలన్న సంకల్పం తో..ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది..ఈ పథకం ద్వారా జిల్లా లో లబ్ధిదారులకు మంజూరు అయిన ఇళ్ల ను వేగవంతం గా నిర్మాణం అయ్యేలా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రత్యేక శ్రద్ధ వహించడం తో నేడు... మంజూరు అయిన ప్రతీ ఇళ్ళు.. నిర్మాణం లో వివిద దశల్లో సాగుతున్నాయిమంజూరు అయిన ఇళ్లను త్వరగా గ్రౌండింగ్ చేస్తూ.... రాష్ట్ర స్థాయి లో జిల్లా ను ప్రథమ స్థానం లో నిలబడేందుకు చేసిన కృషి... జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాటల్లోనేప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ లలో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంత ఇళ్ల కల నెరవేర్చడం కోసం పక్క కార్యాచరణ తో ముందుకెళ్ళామునిరుపేద లకు మాత్రమే లబ్ధి చేకూరెలా... అర్హులైన వారిని ఎంపిక చేయడం నుండి మెదలు.... మంజూరు అయిన ప్రతీ ఇళ్ళు నిర్మాణ దశ లోకి వచ్చేందుకు... ప్రభుత్వ మార్గదర్శకాలను తూ. చ తప్పకుండ అమలు చేశాము. .ఒక్కో మండలం వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని, వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని ఇండ్లు ఏ దశలో నిర్మాణంలో ఉన్నాయి, గ్రౌండింగ్ జరగని ఇళ్లకు సంబంధించి... పలుమార్లు రివ్యూ లు చేయడం తో పాటు... లబ్ధిదారులచే పనులు ప్రారంభించేలా చేపట్టిన చర్యల వల్ల... నేడు రాష్ట్ర స్థాయి లో గ్రౌండింగ్ లో జిల్లా ప్రథమ స్థానం లో నిలబడిందినిర్దేశిత లక్ష్యాల సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేయడం తో పాటు.... పథకం ప్రారంభి ంచినప్పటి నుండి.. మండల స్పెషల్ అధికారులను, తహసీల్దార్ లను, సంబంధిత శాఖ అధికారులను ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి పరిశీలన కు పంపడం వల్ల మంజూరు అయిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం గా అయ్యాయిప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పనులు చేపట్టడానికి, ఇందిరమ్మ కమిటీల సహకారం కూడా దోహద పడిందన్నారు జిల్లా ల్లో ..రెండు విడతల్లో. .5834 ఇళ్ళుమంజూరు కాగా...ఇప్పటివరకు 5206 ఇళ్ళు నిర్మాణ దశ లో ఉండగా.. 33 ఇళ్ళు పూర్తి అయ్యాయి. 4499 మంది లబ్ధిదారులకు వివిధ దశల వారీగా డబ్బులు పడ్డాయి

ప్రభుత్వం చేపట్టే ప్రతీ సంక్షేమ పథకం... ప్రతీ గడపకు చేరేలా పక్క కార్యాచరణ రూపొందిస్తూ...వివిధ శాఖల అధికారులను భాగస్వామ్యం చేయడంతో పాటు.. క్షేత్ర స్థాయి లో కూడా పక్కాగా అమలు అయ్యేందుకు... నిరంతర పర్యవేక్షణ మూల కారణమని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు

# నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- బొల్లారంలో ఖేలో ఇండియా స్టేడియం
- 30 కోట్లతో ఆధునిక క్రీడా ప్రాంగణం
- పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు , డిసెంబర్ 26(సమయం న్యూస్):** శరవేగంగా అభివ ృద్ధి చెందుతున్న బొల్లారం డివిజన్ పరిధిలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో 30 కోట్ల రూపాయలతో ఖేలో ఇండియా క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఖాసీం బేగ్, బొల్లారం డిప్యూటీ కమిషనర్ కిషన్‌లతో కలిసి స్టేడియం ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బొల్లారం డివిజన్ పరిధిలో ఇప్పటికే ఐదున్నర ఎకరాల స్థలాన్ని స్టేడియం కోసం కేటాయించినట్లు తెలిపారు. ఈ స్థలంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా స్టేడియం ఏర్పాటు చేసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా 9.30 కోట్ల రూపాయలతో సింథటిక్ ట్రాక్, 14 కోట్ల రూపాయలతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి శివారులో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్వామి వివేకానంద స్టేడియం అభివ ృద్ధికి 20 కోట్ల రూపాయలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ స్టేడియంలో 10 కోట్ల రూపాయలతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, 3 కోట్ల 15 లక్షలతో స్విమ్మింగ్ పూల్, 6 కోట్ల 50 లక్షలతో సింథటిక్ ట్రాక్, 35 లక్షలతో బాక్స్ క్రికెట్ ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. త్వరలోనే పరిపాలన అనుమతులు మరియు నిధుల మంజూరు జరగనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పటాన్ చెరు మైత్రి మైదానంలో ఖేలో ఇండియా కబడ్డీ శిక్షణ అకాడమీ మంజూరు అయిందని తెలిపారు. ఈ అకాడమీలో 20 సంవత్సరాల లోపు బాలురు, బాలికలు శిక్షణ పొందవచ్చని, అకాడమీకి సంబంధించి చిన్న కేంద్రం ఏర్పాటుకు 7 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు. రాబోయే జనవరి నెలలో అకాడమీ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పటాన్ చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు తన సొంత నిధులతో కూడా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిన్నారం మాజీ జెడ్పిటిసి కోలన్ బాల్ రెడ్డి పాల్గొన్నారు.

# వర్గల్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 26 :** వర్గల్ మండలంలోని గౌరారం గ్రామ సర్పంచ్ కనకరాజు వర్గల్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా కొంపల్లిలోని వంటేరు ప్రతాప్ రెడ్డి నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. వర్గల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా ఎన్నికైన కనకరాజును పాలకవర్గాన్ని అభినందిస్తూ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కెసిఆర్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు కెసిఆర్ పై రేవంత్ రెడ్డి మాట్లాడిన భాషను యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలు చేకూరుతున్నారని అన్నారు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిని స్థాయిని మరిచిపోయి గల్లీ లీడర్ గా వ్యవహరిస్తున్నారని తెలిపారు గజ్వేల్ నియోజకవర్గంలో అత్యధికంగా రెండు స్థానాలలో బిఆర్ఎస్ సర్పంచులు మేజర్ గ్రామపంచాయతీలను సర్పంచ్ ఎన్నికలలో బిఆర్ఎస్ కైవసం చేసుకుందని తెలిపారుకాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు లేక పరిస్థితి దయనీయంగా మారిందని కెసిఆర్ రైతులను రాజు చేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి రైతులను బిచ్చగాళ్లు చేసే విధంగా పరిపాలన నిర్ణయాలు ఉన్నాయని తెలిపారు ఇప్పటివరకు రైతులకు రైతుబంధు ఈ దఫా ఇవ్వలేదని తెలిపారు అంతేకాకుండా రైతులకు కౌంటు ఇవ్వడంలో యూరియా సరఫరా చేయడంలో విత్తనాలు సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు, యూరియా సరఫరాకు ఆప్ తీసుకోవడం చాలా దారుణం అన్నారు చాలావంది రైతులకు స్మార్ట్ ఫోన్లు ఉండవని యాప్ ఎలా ఉపయోగించాలో వారికి తెలియదని రైతుల పట్ల ఇప్పటికైనా రేవంత్ రెడ్డి కళ్ళు తెరిచి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు గెలుపొందిన సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారుఈ కార్యక్రమంలోవర్గల్ మండలం వైస్ ఎంపీపీల మాజీ ప్రెసిడెంట్ కడపల బాల్రెడ్డి,మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి లక్ష్మారెడ్డి కొండల్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి,వార్డు మెంబర్లువి అశోక్,ణ అశోక్, రజిత, బాలమని,,కరుణాకర్ గౌడ్, యాదగిరి, శేఖర్, నరేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్,చంద్రంగౌడ్, అశోక్, పర్వతాలు, మైపాల్ రెడ్డి, కొండల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రాజు గౌడ్ భాస్కర్ గౌడ్, వీరేశం, రామచంద్రం, లక్ష్మారెడ్డి, రామకృష్ణ, కనకయ్య, కనకరాజు, భాస్కర్, వెంకట్ గౌడ్, మనోహర్ గౌడ్, నవీన్ రెడ్డి, నవీన్ గౌడ్, రామ్ రెడ్డి, యశ్వంత్, సాయి, గణేష్, రవీందర్ రెడ్డి, చందు రెడ్డి, నందు రెడ్డి, వంశీ, బున్ని అజయ్, ప్రసన్న, ప్రశాంత్ గౌడ్, బాలు, బాలకృష్ణారెడ్డి, చైతు గౌడ్, పల్లకిష్టయ్య లక్ష్మణ్ శ్రీను దేవేందర్ రెడ్డి ఉన్నారు

# గణేష్ గడ్డ దేవాలయం అభివృద్ధికి కృషి

- ప్రారంభానికి సిద్ధంగా రాజగోపురాలు
- సాలహారం పనులు వేగవంతం చేయాలి
- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, డిసెంబర్ 26(సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గ్రామంలో ఉన్న గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయాన్ని భక్తుల సంఖ్యకు అనుగుణంగా అభివ ృద్ధి చేస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన గణేష్ గడ్డ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రముఖులు, ఆలయ ధర్మకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవాలయానికి నాలుగు వైపులా నిర్మిస్తున్న రాజగోపురాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. అయితే సాలహారం పనులు మందకొడిగా కొనసాగు తున్నాయంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను ద ృష్టిలో ఉంచుకొని ఆలయాన్ని మరింత అభివ ృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పటాన్ చెరు మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్ ఆలయ అభివ ృద్ధి కోసం రూ.1 లక్ష 50 వేల విరాళాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా ఆలయ అధికారులకు అందించారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పాండు, సీనియర్ నాయకులు రాజు, ఉపేందర్, వెంకన్న, ఆలయ కార్యనిర్వహణ అధికారి లావణ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఖాజీపల్లిలో కాలుష్య సమస్యపై ఎంపీ రఘునందన్ రావు పర్యటన



**పటాన్ చెరు,జిన్నారం, డిసెంబర్ 26,(సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజీపల్లి గ్రామ సమస్యలను తెలుసుకునేందుకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు శుక్రవారం స్వయంగా గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలు ఉన్న ప్రాంతాల్లో పర్యటిస్తూ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రధానంగా కాలుష్య ప్రభావం అధికంగా ఉన్న ఖాజీపల్లి గ్రామంలో కాలుష్య నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. మంజీరా నీరు సక్రమంగా అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడి అతి త్వరలో పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని ఎంపీ హామీ ఇచ్చారు. అదేవిధంగా, గండి చెరువు అలుగుపెంపు కారణంగా పరిసర ప్రాంతాల్లో సుమారు 100 ఎకరాల పంట భూమి మునిగిపోవడంతో ఆ చెరువు ప్రాంతానికి వెళ్లి ఎంపీ పరిస్థితిని పరిశీలించారు. రైతుల నుంచి వివరాలను సేకరించి, ఈ సమస్యను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ రవీందర్ రెడ్డి, జిన్నారం బీజేపీ మండల అధ్యక్షులు జగన్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ, ఆకుల నవీన్, ఆకుల భార్గవ్, రమాకాంత్‌తో పాటు స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట జిల్లా పరిధిలో చైనా మంజా నిషేధం

- నిబంధనలకు విరుద్ధంగా మాంజా విక్రయించిన, వినియోగించిన
- చట్టపరమైన చర్యలు: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.



**నారాయణపేట, డిసెంబర్,26(సమయం న్యూస్):** నారాయణ పేట జిల్లా పరిధిలో చైనా మాంజ పై నిషేధం విధించడం జరిగిందని, జిల్లా లో ఎవరైనా చైనా మంజా అమ్మిన, దాని వలన ఎవరికైనా ప్రమాదం జరిగిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనతో తెలిపారు. రాబోయే సంక్రాంతి పండగ సందర్భంగా చైనా మాంజ ఎక్కువగా విక్రయించే దుకాణాల పై అధికారులు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలతో పర్యవరణానికి విపత్తుగా మారడం తో పాటు చైనా మాంజ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, చెనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని అన్నారు. చైనా మాంజను ఉపయోగించి గాలి పటాలు ఎగురవేసే క్రమంలో ఎన్నో పక్షులు, సాధారణ ప్రజలు కూడా ప్రమాదానికి గురవుతారు. అదే క్రమంలో గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడ ప్రమాదానికి గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో చైనా మంజా నిషేదించాం అని ఎస్పి తెలిపారు. చైనా మాంజాపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం కేసులు నమోదు చేస్తామనింతెలిపారు. జిల్లా పరిధిలో అన్ని ప్రాంతాల్లో చెనా మాంజా విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకొవడం జరుగుతొందని ప్రధానంగా ప్రజలు సైతం చెనా మాంజా వినియోగించకుండా ఎవరికి హాని కలగని సాధారణ దారంతో గాలిపటాలను ఎగురవేసుకోవాలని, అలాగే ఎవరైనా చెనా మాంజా విక్రయిస్తున్న, వినియోగిస్తున్న డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలనీ జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.

# వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సంసాగత ఎన్నికల జరుపుకుటకు సమావేశం



**వికారాబాద్,డిసెంబర్,26(సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సంసాగత ఎన్నికలు జరుపుకుటకు శుక్రవారం వికారాబాద్ లో పత్రిక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి పరిశీలకులుగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ వినోద్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రంజెట్టి నరేందర్ హాజరైనారు, అలాగే ముఖ్య అతిథులు గా పరిగి ఎమ్మెల్యే రామోహన్ రెడ్డి పాల్గొనడం జరిగింది, అలాగే పట్టణ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్యం శేట్, కిషన్ నాయక్, చిగుల్ల పల్లి రమేష్, రాంచెంద్ర రెడ్డి, ఓబీసీ చైర్మన్, యాలాల పార్టీ ప్రెసిడెంట్ నర్సిరెడ్డి, సురేందర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్, తదితరులు సీనియర్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యవర్గం ఏర్పాటుకు మార్గదర్శకాలు సూచించడమైనది. జిల్లా కార్యవర్గ లో ఒక్కరు జిల్లా కోశాధికారి గా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న ప్రతి బ్లాక్ నుండి ఒక్కరిని ఉపాధ్యక్షులు గా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న ప్రతి బ్లాక్ నుండి ఇద్దరు చొప్పున ప్రధాన కార్యదర్శులు గా, ప్రతి మండలం నుంచి ఒక్కరు చొప్పున కార్యదర్శులు గా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్క జిల్లా అధికార ప్రతినిధులుగా, జిల్లా కార్యవర్గ సభ్యులు లను అలాగే మున్సిపాలిటీల నుండి కూడా క

# పరిగి మున్సిపాలిటీనీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి
- సిసి రోడ్డు పనులు ప్రారంభం



**పరిగి మున్సిపల్, డిసెంబర్,26(సమయం న్యూస్) :** పరిగి మున్సిపల్ బిసి కాలనీలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి మున్సిపల్ నిధుల ద్వారా 9 లక్షల వ్యయంతో సి సి రోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టిఆర్ఆర్ మాట్లాడుతూ ఇప్పటికే మున్సిపల్ లో పలు అభివృధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది అని సుమారు 50 కోట్ల రూపాయలతో రోడ్లకు అలాగే వ ఖరుగు కాలువలకు నిధులు మంజూరు అయ్యి టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ ఏయంసి చైర్మన్ పరశురాం రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ రైఫిల్ షూటింగ్‌కు ఎంపికైన ముస్తఫా బేగ్

- సన్మానించిన పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి



**పరిగి మున్సిపల్, డిసెంబర్,26(సమయం న్యూస్) :** పరిగి పట్టణానికి చెందిన మిర్జా ముస్తఫా బేగ్ నేషనల్ రైఫిల్ షూటింగ్‌కు ఎంపిక కావడం పరిగి నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచింది. బోపాల్‌లో ఇటీవల నిర్వహించిన 68వ నేషనల్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి అర్హత సాధించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా సాయుధ దళాలు, పారామిలిటరీ, వివిధ ప్రభుత్వ విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సుమారు 6 వేల మంది షూటర్లు పాల్గొనగా, ముస్తఫా బేగ్ తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ముస్తఫా బేగ్ ను ఘనంగా సన్మానించారు. క్రమశిక్షణ, కఠిన సాధనతో ఇలాంటి విజయాలు సాధించడం అభినందనీయమని తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ముస్తఫా సాధించిన ఈ విజయం యువతకు స్ఫూర్తిదాయకమని, క్రీడల్లో పరిగి పేరు జాతీయ స్థాయిలో మరింత వెలుగొందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# నిరుపేదలకు ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయనిది

- రెండున్నర లక్షల విలువైన ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్



**పటాన్‌చెరు, డిసెంబర్ 26 (సమయం న్యూస్):** నిరుపేదలకు ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయనిదని, ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి కీలకంగా నిలుస్తోందని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆంధ్రా కాలనీకి చెందిన శివానంద గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్య చికిత్స అవసరమైంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే జీఎంఆర్ ద్వారా సీఎంఆర్ఎఫ్ నుంచి ఎల్‌ఓసీ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2 లక్షల 50 వేల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ ను మంజూరు చేసింది. ఈ ఎల్‌ఓసీని శుక్రవారం పటాన్‌చెరులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శివానంద కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద కుటుంబాలకు వైద్య చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, వెంకటేష్, శ్రీనివాస్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్పంచులను సన్మానించిన మంత్రులు పొన్నం ప్రభాకర్ వివేక్ వెంకటస్వామి



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 26 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థులకు శుక్రవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ తో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందరరేగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నూతనంగా గెలిచిన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమ పథకాల ప్రభావంతోనే సర్పంచ్లు, వార్డు సభ్యులను గెలిపించుకున్నామని పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ విజయమే లక్ష్యంగా యాత్ర కొనసాగాలని సూచించారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ఇంచార్జ్ మంత్రికి విన్న వించుకుని తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగిశాయని, ఓడిన వారు కూడా పార్టీ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచులు సూచించిన ఐదు ప్రధాన సమస్యలపై మంత్రులుగా తామిద్దరం చొరవ చూపుతామని, గ్రామాల్లోని అన్ని సమస్యలను పరిష్కరించుకుందామని చెప్పారు. మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ గజ్వేల్లో తొంభైకి పైగా స్థానాల్లో కాంగ్రెస్ మద్దతు ఉన్నవారు సర్పంచులుగా గెలవడం కెసిఆర్ గుబులు మొదలైనట్లు స్పష్టం చేస్తోందన్నారు. గజ్వేల్ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా కాంగ్రెస్ పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దుబ్బాకలో గతంతో పోలిస్తే ఎక్కువగా 56 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందిందని, సిద్దిపేటలో గతంలో అభ్యర్థులే దొరకని పరిస్థితి ఉండగా ఇప్పుడు ప్రతి స్థానంలో పోటీ చేసి కొన్ని గెలిచామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ క్రమంగా బలహీనపడుతోందని వాక్యానించారు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం వంటి పథకాలపై ప్రజల్లో మంచి స్పందన ఉందని, పార్టీ శ్రేణులు ప్రజల్లో ఉండి వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. అలా చేసినప్పుడే నాయకుడు ప్రజల మధ్య బంధం బలపడుతుందన్నారు. జిల్లాకు ఎక్కువ నిధులు, ఎక్కువ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు. జూబ్లీహిల్స్ లోనూ కాంగ్రెస్ బలం లేదన్న ప్రచారాన్ని తిప్పికొట్టి భారీ మెజారిటీతో గెలిచామని గుర్తుచేశారు. గెలిచిన సర్పంచులందరినీ ముఖ్యమంత్రితో కలిపిస్తామని, పార్టీ శ్రేణులు చూపిన శ్రమ అభినందనీయమని అన్నారు.

# విబి జి రాంజీ నాలుగు లేబర్ కోడ్ జీవో కాపీల దగ్ధం



**ఖమ్మం, డిసెంబర్ 26 : ( సమయం న్యూస్ ):** వి బి ఈ రాంజీ , నాలుగు లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఖమ్మంలో వీటి తాలూకు జీవో లను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరం రావు , రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ , సభ్యులు యర్రా శ్రీనివాసరావు. జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కార్మిక ,కర్షక వ్యవసాయ కూలీ హక్కులను కాల రాస్తూ పార్లమెంటులో మెజార్టీ ఉందని దుర్మార్గమైన బిల్లులను ప్రవేశ పెడుతూ ఉపాధి హక్కులను కాలరాస్తున్నారు. వ్యవసాయ కూలీలకు హాని కలిగించే విబిజీ రామ్ జి బిల్లు బిల్లును రద్దు చేయాలని, దాని స్థానంలో గతంలో ఉన్న మహాత్మా గాంధీ గ్రామీణ హామీ చట్టమును అమలు చేయాలని డిమాండ్ చేశారు . కార్మికులకు హాని కలిగించే హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్ర ద్దు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు రైతు సంఘం జిల్లా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జీవో కాపీలను దగ్ధం చేయటం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుల సభ్యులు యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో పొన్నం వెంకటేశ్వరావు మాదినేని రమేష్ మాట్లాడుతూ వెంటనే ఈ బిల్లును రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ,రైతు సంఘం ,సిఐటియు నాయకులుజిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ ఎస్ కేమీరా ,మధు ,వాసిరెడ్డి ప్రసాద్, పడిగల నాగేశ్వరరావు ,వడ్లమూడి నాగేశ్వరరావు ,సిఐటియు ఉపేందర్ ,మొర్రి మేకల వెంకన్న ,ఆమంచి ,ఎస్ కే ఇమామ్ ,నాగరాజు ,ప్రతాపనేని వెంకటేశ్వరరావు ,గుండె వెంకట్రావు, సైదులు, తీగల వెంకటేశ్వర్లు ,సారంగి పాపారావు ,రంగు హనుమంత చారి, జంగం నగేష్, కూతదితరులు పాల్గొన్నారు.

# సోయా రైతులను ఆదుకోవాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరిన మంత్రి జూపల్లి
- సోయా రైతుల కష్టాలను వివరించిన మంత్రి జూపల్లి
- నాఫెడ్ ద్వారా తక్షణమే సోయాబీన్ కొనుగోళ్లు చేపట్టాలి
- నేరడిగొండ మార్కెట్ యార్డులో రైతులను కలిసి సమస్యలు తెలుసుకున్న మంత్రి జూపల్లి



**నేరడిగొండ డిసెంబర్26( సమయం న్యూస్) :** సోయాబీన్ సాగు చేసి ఇబ్బందుల్లో ఉన్న రైతులకు న్యాయం చేయాలని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్ ద్వారా తక్షణమే కొనుగోళ్లు జరిపించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృషారావు.. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. శుక్రవారం ఆదిలాబాద్ పర్యటనలో ఉన్న కిషన్ రెడ్డిని పెన్ గంగా గెస్ట్ హౌస్‌లోమంత్రి జూపల్లి కలిసి రైతుల సమస్యలపై సుదీరంగా చర్చించారు. రైతులతో కలిసి వారి సమస్యలను కిషన్ రెడ్డికి వివరించారు.

**రైతుల కష్టాలను వివరించిన మంత్రి....** ఈ సందరరేగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల సోయాబీన్ పంట నాణ్యత దెబ్బతినడంతో పాటు సోయాబీన్ రంగు మారిదని.. ఇది రైతులకు మరింత శాపంగా మారిందని వివరించారు. మార్కెట్ యార్డుల్లో రైతులు తమ పంటను విక్రయించేందుకు రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. కొనుగోళ్లు నిలిచిపోవడంతో గ్రామాల్లోని రైతుల ఇళ్లలోనే సోయా నిల్వలు పేరుకుపోయాయి. కేంద్రం చొరవ తీసుకుంటేనే రైతులకు మద్దతు ధర దక్కుతుంది" అని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

**నేరడిగొండ మార్కెట్ యార్డులో ఆకస్మిక తనిఖీ**

కేంద్ర మంత్రితో భేటీకి ముందు మంత్రి జూపల్లి కృషారావు నేరడిగొండ మార్కెట్ యార్డును ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ పంటతో వేచి ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని వారికి హామీ ఇచ్చారు. సోయాబీన్ కొనుగోళ్లలో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించాలని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర వ్యవసాయ శాఖకు లేఖ రాశారని మంత్రి జూపల్లి ఈ సందరరేగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, కేంద్రం కూడా సానుకూలంగా స్పందించి నాఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మౌనం మాట్లాడితే ఎలా ఉంటుంది!



మాటలు అలిసిపోయిన చోట, భాష తన అర్థాన్ని కోల్పోయిన వేళ, మౌనం తన నిగూఢ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. ప్రపంచంలోని మహోన్నత ఆవిష్కరణలు, లోతైన ఆలోచనలు అన్నీ నిశ్శబ్దం అనే గర్భం నుంచే రూపుదిద్దుకున్నాయి. మౌనం అంటే కేవలం మాటలు ఆపడం కాదు, అది తనతో తాను జరుపుకునే అంతర్మథనం, సత్యంతో చేసే నిరంతర సంభాషణ. ఒక్కోసారి వేల పదాలు చెప్పలేని నిజాన్ని ఒక చిన్న నిశ్శబ్దం అత్యంత సులువుగా అర్థమయ్యేలా చేస్తుంది. శబ్దం బయటి ప్రపంచాన్ని పరిచయం చేస్తే, మౌనం లోపలి ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. ఇది ఆత్మ యొక్క నిశ్శబ్ద ప్రార్థనగా మారి, మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది.

ఫిరోజ్ ఖాన్
సీనియర్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464



### శాస్త్రీయ నిరూపణలు

మౌనం మెదడును పునరుజ్జీవింపజేస్తుందని ఆధునిక విజ్ఞాన శాస్త్రం అత్యంత ప్రభావవంతంగా నిరూపించింది. 2013వ సంవత్సరంలో వెలువడిన 'మెదడు నిర్మాణం మరియు విధి' అనే అంతర్జాతీయ పరిశోధనా పత్రం దీనికి ప్రామాణికం. రోజుకు కనీసం రెండు గంటల పాటు నిశ్శబ్దంగా ఉండటం వల్ల మెదడులోని జ్ఞాపకశక్తికి నిలయమైన భాగంలో కొత్త కణాల పుట్టుక వేగవంతమవుతుంది. నిరంతర శబ్ద కాలుష్యం వల్ల శరీరంలో పెరిగే ఒత్తిడి హార్మోన్ల ప్రభావాన్ని మౌనం సమూలంగా తగ్గిస్తుంది. రక్తపోటును నియంత్రించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో నిశ్శబ్దం ఒక సహజ సిద్ధమైన ఔషధంగా పనిచేస్తుంది. ఇది కేవలం ఒక భావన మాత్రమే కాదు, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే తిరుగులేని వైద్య సత్యం.



చారిత్రక విప్లవాల్లో నిశ్శబ్ద పోరాటాలు: ప్రపంచ చరిత్రలో అనేక సామాజిక మార్పులు నిశ్శబ్ద పోరాటాల ద్వారానే సాధ్యమయ్యాయి. 1917లో న్యూయార్క్‌లో వేలాది మంది ఆఫ్రో-అమెరికన్లు ఎటువంటి నినాదాలు చేయకుండా చేసిన 'సైలెంట్ ప్రొటెస్ట్ పరేడ్' జాతి వివక్షపై గొప్ప నిరసనగా మిగిలిపోయింది. మహాత్మా గాంధీ దేశ విభజన అల్లర్ల సమయంలో మౌన వ్రతం ద్వారానే శాంతి సందేశాన్ని వినిపించి జనాలను ఆలోచింపజేశారు. మాటల కంటే నిశ్శబ్దం ఎంత లోతుగా గుచ్చుకుంటుందో, ఎంతటి మార్పును తెస్తుందో ఈ చారిత్రక ఘటనలు నిరూపిస్తాయి. విమర్శలు ఎదురైనప్పుడు మౌనంగా ఉండటం బలహీనత కాదు, అది ఒక శక్తివంతమైన నిరసనగా మారి శత్రువును సైతం ఆలోచనలో పడేస్తుంది.

సృజనాత్మకతకు నిశ్శబ్దమే ప్రయోగశాల: ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్తలు, కవులు, తత్వవేత్తల విజయాల వెనుక మౌనం ఒక గొప్ప తోడుగా నిలిచింది. సర్ ఐజాక్ న్యూటన్ ప్లేగు వ్యాధి సమయంలో ఏకాంత మౌనంలో గడిపినప్పుడే గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని కనుగొన్నారు. ఐన్‌స్టీన్ సాపేక్షత సిద్ధాంతం వంటి అద్భుతాలు కూడా నిశ్శబ్ద ఏకాంతంలోనే రూపుదిద్దుకున్నాయి. శబ్దం మనిషిని బాహ్య ప్రపంచపు గందరగోళంలో పడేస్తే, మౌనం అంతరాత్మ వైపు నడిపించి కొత్త ఆలోచనలకు ప్రాణం పోస్తుంది. ఆధునిక రచయితలు సైతం డిజిటల్ శబ్దాలకు దూరంగా, నిశ్శబ్ద వాతావరణంలోనే అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. నిశ్శబ్దంలోనే మేధస్సు తన పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

మానవ సంబంధాలలో మౌనం పాత్ర: సాధారణంగా భాషను శబ్ద రూపంలోనే గుర్తిస్తాం, కానీ శబ్దం కంటే శక్తివంతమైన భాష మౌనం. ఒక వ్యక్తి ఆనందంలో ఉన్నప్పుడు చిరునవ్వు, తీవ్ర దుఃఖంలో ఉన్నప్పుడు కన్నీరు నిశ్శబ్దంగానే భావాలను వ్యక్తపరుస్తాయి. మానవ సంబంధాలలో అనవసర వాదనలు పెరిగినప్పుడు ఒకరి మౌనం ఆ వివాదాన్ని ఇక్కడితో ఆపగలదు. ఎదుటివారి బాధను అర్థం చేసుకోవడానికి ఓదార్పు మాటల కంటే మౌనంగా పక్కన ఉండటం ఎక్కువ భరోసానిస్తుంది. మౌనం మాట్లాడటం మొదలుపెడితే అక్కడ కపటం ఉండదు, కేవలం హృదయాల మధ్య అనుబంధం మాత్రమే ఉంటుంది. ఇది వ్యక్తిలోని పరిణతిని మరియు ఎదుటివారి పట్ల ఉన్న గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.



ఆధ్యాత్మిక దృక్పథం : భారతీయ సంస్కృతిలో 'మౌన వ్రతం'కి ఒక విశిష్టమైన, పవిత్రమైన స్థానం ఉంది. మునులు, ఋషులు మౌనం ద్వారానే అపారమైన మానసిక శక్తిని, ఆధ్యాత్మిక ఉన్నతిని పొందారని పురాణాలు చెబుతున్నాయి. నేటి కాలంలో 'విపాసన' వంటి ధ్యాన పద్ధతులు మౌనం యొక్క ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా చాటిచెబుతున్నాయి. అంతర్గత ప్రశాంతత కోసం, ఆత్మశుద్ధి కోసం మౌనం ఒక దివ్యమైన ఆయుధంగా ఉపయోగపడుతుంది. బాహ్య ప్రపంచంలోని అసత్యాలు, విమర్శల నుండి మనల్ని మనం కాపాడుకోవడానికి మౌనం ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. మౌనంలోనే దైవత్వం దాగి ఉంటుందని, అది ఆత్మను పరమాత్మతో అనుసంధానిస్తుందని ఆధ్యాత్మికవేత్తలు విశ్వసిస్తారు.

డిజిటల్ యుగంలో మౌనం: నేటి సాంకేతిక ప్రపంచంలో మనం నిరంతరం నోటిఫికేషన్లు, సోషల్ మీడియా హోరులో మునిగిపోతున్నాం. దీనివల్ల మెదడుపై భారం పెరిగి ఏకాగ్రత సమయం క్రమంగా తగ్గుతూ వస్తోందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఇటువంటి తరుణంలో 'డిజిటల్ డెటాక్స్' పేరుతో నిశ్శబ్దాన్ని ఆశ్రయించడం ఒక అనివార్యమైన అవసరంగా మారింది. రోజుకు కనీసం పది నిమిషాల మౌనం రక్తపోటును తగ్గించి, శరీరం తనను తాను బాగుచేసుకోవడానికి సహకరిస్తుంది. మాటల హోరులో కోల్పోతున్న మనల్ని మనం వెతుక్కోవడానికి మౌనం ఒక దిక్సూచిలా ఉపయోగపడుతుంది. మౌనం అనేది శూన్యం కాదు, అది అనంతమైన అర్థాల నిలయం మరియు సత్యానికి ప్రతిరూపం.

## రిమ్స్‌లో నూతన క్రిటికల్ కేర్ సెంటర్ ప్రారంభం

- పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి:
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రి జూపల్లి

అదిలాబాద్



**డిసెంబర్26(సమయంన్యూస్) :** పేద ప్రజలకు అత్యున్నతమైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆస్పత్రిలో రూ. 23.75 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్ ను ఆయన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి క ృష్ణారావుతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు ప్రసూతి గది, మైనర్ ఓటీ, 13 పడకల ఐసోలేషన్ వార్డులను కూడా ప్రారంభించారు.అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఆదిలాబాద్ జిల్లా అభివ ృద్ధికి క ృషి చేస్తున్నాయని వివరించారు. ముఖ్యంగా వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలను పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం రూ. 1.50 లక్షల కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. వైద్య విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామ న్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయ ఉత్పత్తులకు నాణ్యమైన గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. భూగర్భజలాలు పెంచేందుకు ప్రతి వర్షపు నీటిని సంరక్షించుకోవాలని సూచించారు. త్వరలోనే ఆదిలాబాద్‌లో కేంద్రీయ విద్యాలయం ప్రారంభోత్సవం ఉంటుందని ప్రకటించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి క ృష్ణారావు మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లాలో సామాజిక వర్గాలు అధికంగా ఉన్నందున, వారి ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద ఆరోగ్య, వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపడుతుందని ప్రకటించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలను రూ. 5 లక్షల నుండి 10లక్షలకు పెంచామని, ఇప్పటివరకు సీఎంఆర్ రిలీఫ్ ఫండ్ కింద రూ. 800 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. నూతనంగా 6,956 మంది స్టాఫ్ నర్సులను, 4,330 మంది డాక్టర్లను నియమించినట్లు వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తనవంతు సహాయం చేస్తుందని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సమన్వయంతో ఆదిలాబాద్ జిల్లా అభివ ృద్ధికి తక్షణ చర్యలు చేపడుతున్నాయని మంత్రులు స్పష్టం చేశారు.ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర సహకారం అందిస్తున్నాయని ఆదిలాబాద్ ఎంపీ నగేష్ అన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ బ్లాక్ పూర్తయితే ఆదిలాబాద్‌తో పాటు సమీప జిల్లాల ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వైద్య రంగంలో ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. అలాగే జిల్లాలో ప్రతిపాదిత ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ద్వారా ఆదిలాబాద్ జిల్లా ఆర్థిక, పారిశ్రామిక అభివ ృద్ధికి కొత్త దిశ లభిస్తుందని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, పర్యాటక రంగం మరింత అభివ ృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా అమలు చేసేందుకు తాను కేంద్ర ప్రభుత్వ స్థాయిలో పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ప్రజలు కోరుకుంటున్న అభివ ృద్ధి పనులు ఇప్పుడు కార్యరూపం దాలుస్తున్నాయని అన్నారు. రిమ్స్ ఆసుపత్రిని అత్యాధునిక వైద్య సదుపాయాలతో అభివ ృద్ధి చేయడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు కల నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయని, ఇది ఆదిలాబాద్ భవిష్యత్తును మారుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల శాసన సభ్యులు అనిల్ జాదవ్, వెడ్మా బొజ్జు, ఎమ్మెల్సీలు విఠల్, కొమురయ్య జిల్లా గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, ఆర్డీఓ స్రవంతి, వివిధ శాఖల అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అదిలాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది



**అగిలాబాద్ డిసెంబర్26( సమయం న్యూస్). :** ఆదిలాబాద్ జిల్లా సమగ్ర అభివ ృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, పెండింగ్‌లో ఉన్న ఎయిర్‌పోర్ట్ (విమానాశ్రయం) నిర్మాణ పనులను త్వరలోనే పట్టాలెక్కిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక ఎయిర్‌పోర్ట్ మైదానాన్ని సందర్శించి, విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తో పాటు ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ, నిర్మాణ స్థలం యొక్క మ్యాపింగ్, ఇతర సాంకేతిక అంశాలను వారు ఈ సందర్భంగా అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సంబంధించిన భూమి యొక్క సరిహద్దులు, అందుబాటులో ఉన్న విస్తీర్ణంపై అధికారులు మ్యాపింగ్‌ను మంత్రికి చూపించి, వివరాలను నివేదించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, ఈ విమానాశ్ర యం నిర్మాణం ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల స్వప్నం. ఈ ప్రాజెక్టు పూర్తి కోసం కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. తెలంగాణలోని మారుమూల ప్రాంతాలన్నింటినీ దేశంలోని ప్రధాన నగరాలతో అనుసంధానించాలనే ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడానికి క ృషి చేస్తామని తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించామని అన్నారు. నిర్మాణ పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభ మయ్యేందుకు ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా ఈ ప్రాజెక్టుకు పూర్తి సహకారం ఉంటుందని ఆశిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తే, ఈ ప్రాంత ప్రజల రవాణా, వ్యాపార అవసరాలు తీరుతాయన్నారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ ప్రక్రియలో మరింత వేగం పుంజుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ విమానాశ్రయం భవిష్యత్తులో ఈ ప్రాంత ఆర్థికాభివ ృద్ధికి, పర్యాటక రంగానికి ఊతమిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎస్పీ అఖిల్ మహాజన్, విమానాశ్రయాల అథారిటీ ఆఫ్ ఇండియా కి చెందిన ఇంజినీర్లు, ఆర్డీఓ స్రవంతి, మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారిలో కనిపించే లక్షణాలు ఇవే



ప్రస్తుత కాలంలో వయసుతో సంబంధం లేకుండా అన్ని వయసుల వారిని వేధిస్తున్న అనారోగ్య సమస్యల్లో ఫ్యాటీ లివర్ కూడా ఒకటి. ఒకప్పుడు మద్యం ఎక్కువగా తీసుకునే వారిలో మాత్రమే ఈ సమస్య ఉండేది. కానీ ఇప్పుడు మద్యం తాగని వారిలో కూడా మనం ఈ సమస్యను చూడవచ్చు. మారిన జీవనశైలి, చక్కెరలు, అధిక కొవ్వులు ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల మద్యం తీసుకోని వారిలో అన్ని వయసుల వారిలో ఈ వ్యాధి వస్తోంది. ఇది శరీర ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు కాలేయ ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది. కొన్నిసార్లు ఇది నాన్- ఆల్కహాలిక్ స్టీటోహైపటైటిస్, లివర్ ఫైబ్రోసిస్, సిర్రోసిస్ తో పాటు కొన్ని సందర్భాల్లో లివర్ క్యాన్సర్‌కు కూడా దారి తీస్తుంది. కనుక ఫ్యాటీ లివర్ సమస్య నుండి త్వరగా బయటపడడం చాలా అవసరం. ఫ్యాటీ లివర్ సమస్యను నియంత్రించడంతో పాటు దీని లక్షణాలను ముందుగా గుర్తించడం కూడా చాలా అవసరం. కనుక ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారిలో కనిపించే సంకేతాలు, లక్షణాల గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది.

**అధిక బరువు..**

ఈ సమస్యతో బాధపడే వారు ఊహించని విధంగా బరువు పెరుగుతారు. ముఖ్యంగా పొట్ట చుట్టూ కొలత పెరగడం ఫ్యాటీ లివర్ సమస్యకు ఒక కారణం కావచ్చు. పొట్ట చుట్టూ అధికంగా కొవ్వు పేరుకుపోవడం అంతర్లీనంగా ఉన్న కాలేయ సమస్యలను కూడా సూచిస్తుంది. రక్తంలో పెరిగిన చక్కెరలు ఫ్యాటీ లివర్ సమస్యను కూడా సూచిస్తాయని చెప్పవచ్చు. ఫ్యాటీ లివర్ జీవక్రియలను దెబ్బతీయడంతో పాటు కాలేయ పనితీరు మందగించేలా చేస్తుంది. దీంతో ఇన్సులిన్ నిరోధకత పెరిగి రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కనుక రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగితే కాలేయ పనితీరుకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవడం కూడా మంచిది. మనకు అలసట రావడం సహజమే. కానీ విశ్రాంతి తీసుకున్నప్పటికీ అలసట రావడం, ఎప్పుడూ నీరసంగా ఉండడం కూడా ఫ్యాటీ లివర్ కి ఒక సంకేతమే. శరీరానికి తగినంత శక్తిని అందించడంలో కాలేయం ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఫ్యాటీ లివర్ కారణంగా కాలేయ పనితీరు తగ్గుతుంది. దీంతో ఎప్పుడు అలసటగా ఉండడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

**చర్మం, కళ్ల రంగు..**

ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారిలో చర్మం, కళ్లు పసుపు రంగులోకి మారిపోతాయి. కామెర్లు రావడాన్ని తీవ్రమైన ఫ్యాటీ లివర్ సమస్యగా భావించాలి. ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్య సహాయం తీసుకోవాలి. ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారిలో పొత్తికడుపు పైభాగంలో కుడివైపు నొప్పిగా ఉంటుంది. వాపు కారణంగా కాలేయ పరిమాణం పెరుగుతుంది. దీంతో కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. ఫ్యాటీ లివర్ సాధారణంగా శరీరంలో కొవ్వు స్థాయిలు ఎక్కువగా ఉండడాన్ని సూచిస్తుంది. అధిక కొలెస్ట్రాల్ కారణంగా కాలేయ పనితీరు తగ్గడంతో పాటు గుండె సంబంధిత జబ్బులు వచ్చే అవకాశం కూడా ఉంది.

**జాగ్రత్తలు అవసరం..**

మలం, మారిన మూత్రం రంగు కాలేయ అనారోగ్యాన్ని సూచిస్తాయి. బైలిరుబిన్ వల్ల మూత్రం ముదురు రంగులో వస్తుంది. లేత రంగు మలం పిత్త లోపాన్ని సూచిస్తుంది. కాలేయ పనితీరు మందగించడం వల్ల ఇలా జరుగుతుంది. కనుక ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సహాయం తీసుకోవడం చాలా అవసరం. అంతేకాకుండా రోజూ వ్యాయామం చేయడం, సమతుల ఆహారాన్ని తీసుకోవడం, బరువు అదుపులో ఉంచుకోవడం వంటివి చేయాలి. ఆరోగ్యకరమైన కొవ్వులు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలను, లీన్ ప్రోటీన్లను ఎక్కువగా తీసుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలను, చక్కెరలను తక్కువగా తీసుకోవాలి. నీటిని ఎక్కువగా తాగాలి. నీటిని తాగడం వల్ల కాలేయం పనితీరు మెరుగుపడి వ్యర్థాలు బయటకు పోతాయి. మద్యం సేవించడం మానేయాలి.



# రోజూ 30 నిమిషాల వాకింగ్.. ఎన్ని కేలరీలు బర్న్ అవుతాయో తెలుసా?

నేడు అతి పెద్ద ఆరోగ్య సమస్యలలో ఊబకాయం ఒకటి. ఈ సమస్య దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజలను వేధిస్తోంది. ఫలితంగా, చాలా మంది బరువు తగ్గడానికి, దానిని నియంత్రణలో ఉంచడానికి నిరంతరం కష్టపడుతున్నారు. కొంతమంది బరువు తగ్గడానికి వ్యాయామం, వాకింగ్, యోగా చేస్తారు.

మరికొందరు ఆహారం, ఇంటి నివారణలను ప్రయత్నిస్తారు. బిజీ షెడ్యూల్ లేదా ఇతర కారణాల వల్ల వ్యాయామం చేయలేని వారు చాలా మంది ఉన్నారు. అలాంటి వారికి, బరువు తగ్గడం చాలా కష్టం అవుతుంది. బరువు తగ్గడానికి వాకింగ్ చాలా ప్రభావవంతమైన వ్యాయామం. నడక వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇది సులభంగా బరువు తగ్గడానికి సహాయపడుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

**150 నుండి 250 కేలరీలు**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, నడక అనేది ఎవరైనా చేయగలిగే సులభమైన వ్యాయామం. ఇది అన్ని వయసుల వారికి మంచి ఎంపిక. బ్రిస్క్ వాకింగ్ కేలరీలను బర్న్ చేస్తుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. ప్రతిరోజూ 30 నుండి 45 నిమిషాలు నడవడం వల్ల దాదాపు 150 నుండి 250 కేలరీలు బర్న్ అవుతాయి.

శరీరంలో శక్తిని పెంచడానికి, ఆందోళనను తగ్గించడానికి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి నడక ఒక గొప్ప మార్గం. బరువు తగ్గాలనుకునే వారికి నడక ఒక సులభమైన ఎంపిక అని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు. ప్రతిరోజూ మెట్లు ఎక్కడం, ఇంటి చుట్టూ తిరగడం, స్నేహితులతో సరదాగా వాకింగ్ చేయవచ్చు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు బ్రిస్క్ వాకింగ్ చేయడం ఉత్తమమని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. నడక గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మధుమేహం ఉన్నవారికి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది.

# ప్రతిరోజూ బిగ్గరగా నవ్వడం వల్ల దీర్ఘాయువు పెరుగుతుందా?

నేటి ఒత్తిడితో కూడిన జీవితంలో, నవ్వు ప్రభావవంతమైన ఔషధంగా పనిచేస్తుంది. ఇది ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. ప్రతిరోజూ కాసేపు బిగ్గరగా నవ్వడం వల్ల వివిధ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణు లు అంటున్నారు. నవ్వు మానసిక స్థితిని తక్షణమే మెరుగుపరచడమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. క్రమం తప్పకుండా బిగ్గరగా నవ్వడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

**దీర్ఘాయువు పెరుగుతుంది:**

బిగ్గరగా నవ్వడం కూడా మీ మొత్తం ఆయుర్దాయం పెంచే ఒక సాధారణ వ్యాయామం. బిగ్గరగా నవ్వడం దీర్ఘాయువుకు ఎంతో సహాయపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. నవ్వే వ్యక్తులు మంచి ఆరోగ్యం కలిగి ఉంటారు. ఎక్కువ కాలం జీవిస్తారు. ఆనందం ఆయుష్షు పెరుగుదలతో ముడిపడి ఉంటుంది. ఆరోగ్యకరమైన జీవనశైలిలో సానుకూల, సంతోషకరమైన మానసిక స్థితిని కొనసాగించడం ఒక ముఖ్యమైన భాగం అని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది:**

నిపుణుల ప్రకారం, నవ్వు కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. ఇది రోగనిరోధక కణాలను కూడా పెంచుతుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. వ్యాధుల నుండి మనల్ని రక్షిస్తుంది.

**గుండె ఆరోగ్యం:**

నవ్వు మన హృదయ స్పందన రేటును కొద్దిసేపు పెంచుతుంది. అప్పుడు కండరాలు సడలిస్తాయి, రక్తపోటు తగ్గుతుంది. శరీరమంతా రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**శరీరంలో ఆక్సిజన్ పెరుగుతుంది:**

బిగ్గరగా నవ్వడం వల్ల డయాఫ్రాగమ్, ఊపిరితిత్తులు చురుకుగా మారతాయి. ఇది ఆక్సిజన్ స్థాయిని పెంచుతుంది. ఇది ఊపిరితిత్తులలో చిక్కుకున్న గాలిని విడుదల చేస్తుంది. బిగ్గరగా నవ్వడం వల్ల శరీరంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతుంది. శ్వాస తీసుకోవడం సులభం అవుతుంది.

**ఒత్తిడిని తగ్గిస్తుంది:**

నవ్వు ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. ఇది డోపమైన్, సెరోటోనిన్ వంటి ఆనంద హార్మోన్లను ఎక్కువగా విడుదల చేస్తుంది. ఫలితంగా ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.





# ఈ ఆరోగ్య సమస్యలు ఉంటే జాగ్రత్త.. ఖాళీ కడుపుతో టీ తాగకూడదు..

చాలా మందికి ప్రతిరోజూ ఉదయాన్నే టీ తాగే అలవాటు ఉంటుంది. కానీ ఉదయం ఖాళీ కడుపుతో టీ తాగడం ఆరోగ్యానికి హానికరం అని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా, ఈ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు అస్సలు తాగకూడదని అంటున్నారు. అయితే, ఏ వ్యక్తులు ఉదయం ఖాళీ కడుపుతో టీ తాగకూడదు? దీనికి కారణం ఏంటి? ఈ అలవాటు వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో ఇప్పుడు తెలుసుకుందాం..

టీ ఆకులలో కెఫిన్, టానిన్లు ఉంటాయి. టీ తయారుచేయడానికి పాలు, చక్కెర కలుపుతారు. దీని వల్ల శరీరానికి తాత్కాలిక శక్తి లభిస్తుంది. కానీ, వాస్తవానికి అవి శరీర జీవక్రియపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అంతేకాకుండా, రక్తహీనత (ఇనుము లోపం) ఉన్నవారు ఖాళీ కడుపుతో టీ తాగకూడదు. ఎందుకంటే టీలోని ఖనిజాలు ఇనుము శోషణకు ఆటంకం కలిగిస్తాయి. అలాగే, అధికంగా జుట్టు రాలే సమస్యతో బాధపడేవారు కూడా ఖాళీ కడుపుతో టీ తాగకూడదు. ఇంకా, డయాబెటిస్, గ్రాజూా, ఆందోళన, అధిక రక్తపోటు, హైపోథైరాయిడిజంతో బాధపడేవారు కూడా ఖాళీ కడుపుతో టీ తాగకూడదు.

**ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల కలిగే సమస్యలు:**

జీర్ణ సమస్యలు: టీలోని కెఫిన్, టానిన్లు జీర్ణ రసాల స్రావాన్ని ప్రభావితం చేస్తాయి. ఇది ఆహారం సరిగ్గా జీర్ణం కాకుండా నిరోధిస్తుంది. కాలక్రమేణా, ఇది తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. గుండెల్లో మంట, అసిడిటీ: ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల కడుపులో ఆమ్ల స్థాయిలు పెరుగుతాయి. ఇది గ్యాస్, అసిడిటీ, గుండెల్లో మంట వంటి సమస్యలకు దారితీస్తుంది. ఇప్పటికే ఈ సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. విశ్రాంతి లేకపోవడం: ఖాళీ కడుపుతో టీ తాగితే హృదయ స్పందన రేటు పెరుగుతుంది. ఇలా విశ్రాంతి లేకుండా చేస్తుంది. ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అకస్మాత్తుగా పెరగడం లేదా తగ్గే అవకాశం ఉంది. ఇది మధుమేహం ఉన్నవారికి ప్రమాదకరం.



## వైభవ్ సూర్యవంశీకి 'బాల పురస్కార్ అవార్డు'

క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అరుదైన ఘనత దక్కింది. అతడు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డు దక్కించుకున్నాడు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా వైభవ్ ఈ పురస్కారం తీసుకున్నాడు. చిన్న వయసులోనే క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినందుకు గానూ వైభవ్ ఈ పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. దీంతో ఐపీఎల్‌లో అతి పిన్న వయసులో (14 ఏళ్ల 23 రోజులు) అరంగేట్రం చేసిన క్రికెటర్‌గా ఘనత సాధించాడు. అలాగే ఈ టోర్నీలో తాను ఆడిన మూడో మ్యాచ్‌లోనే సూపర్ సెంచరీ సాధించాడు. గుజరాత్ టైటాన్స్ జట్టుపై 35 బంతుల్లోనే సెంచరీ అందుకొని ఐపీఎల్ హిస్టరీలో అతి తక్కువ బంతుల్లో ఈ ఘనత సాధించిన భారత తొలి బ్యాటర్‌గానూ రికార్డ్ కొట్టాడు. ఈ తర్వాత తన ఫామ్ కొనసాగిస్తూ వైభవ్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్, అండర్ -19 ఆసియా కప్, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీల్లోనూ సెంచరీలు నమోదు చేశాడు. రీసెంట్‌గా విజయ్ హజారే ట్రోఫీలో అరుణాచల్ ప్రదేశ్ జట్టుపై తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. 84 బంతుల్లో 190 పరుగులు ఔరా అనిపించాడు. ఇందులో 16 ఫోర్లు, 15 సిక్స్‌లు ఉండడం విశేషం. అలా ఏప్రిల్ నుంచి ఈ ఏడాది వైభవ్ ఆడిన ప్రతీ టోర్నీలో తన మార్క్ చూపించాడు.

## బాక్సింగ్ డే టెస్టులో బౌలర్ల ఆదిపత్యం



మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా ఆస్ట్రేలియా- ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో తొలి రోజు పూర్తిగా బౌలర్లే ఆధిపత్యం ప్రదర్శించారు. యాషెస్‌లో భాగంగా జరుగుతున్న ఈ నాలుగో టెస్టులో మొదటి రోజే 20 వికెట్లు నేలకూలాయి. దీంతో మొదటి రోజే రెండు జట్ల తొలి ఇన్నింగ్స్ ముగిసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాను 152 పరుగులకు ఇంగ్లాండ్ ఆలౌట్ చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్‌ను ఆసీస్ 110 పరుగులకే కుప్పకూల్చింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్‌ను ఇంగ్లాండ్ పేసర్లు జోష్ టంగ్, గస్ అట్కిసన్ అదుతేంగా కట్టడి చేశారు. ఫామ్‌మీదున్న ఆసీస్ బ్యాటర్లకు కల్లెం వేశారు. ఏడో ఓవర్ తొలి బంతికే ఆసీస్ పతనం ప్రారంభమైంది. అట్కిసన్ వేసిన అదుతే బంతికి ట్రావిస్ హెడ్ (12) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత ఆసీస్ వరుసగా వికెట్లు కోల్పోయింది. నేసర్ (35) జట్టులో టాప్ స్కోరర్. ఇంగ్లాండ్ బౌలర్లలో టంగ్ 5 వికెట్లతో అదరగొట్టగా, అట్కిసన్ 2, బ్రెండన్ కార్స్, బెన్ స్టోక్స్ చెరో 1 వికెట్ పడగొట్టారు. ఆసీస్‌ను తక్కువ స్కోర్‌కే ఆలౌట్ చేసిన ఆనందం ఇంగ్లాండ్‌కు ఎంతోసేపు నిలవలేదు. ఎందుకంటే ఇంగ్లాండ్ ఇంకా దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంది. పేస్‌కు సహకరిస్తున్న పిచ్‌పై కంగారూ బౌలర్లు మరింత రెచ్చిపోయారు. ఫలితంగా 8 పరుగులకే ఇంగ్లాండ్ 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. టాప్ 3 బ్యాటర్లు జాక్ క్రేలీ (5), బెన్ డకెట్ (2), జకాబ్ బెతెల్ (0) ఘోరంగా విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్ల విధ్వంసానికి ఎనిమిది మంది సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. హ్యారీ బ్రూక్ 41 పరుగులతో జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. నెసర్ 4 వికెట్లతో రాణించగా, బొలాండ్ 3, మిచెల్ స్టార్క్ 2, కామెరూన్ గ్రీన్ 1 వికెట్ దక్కించుకున్నారు. అలా ఈ టెస్టులో తొలి రోజే మొత్తం 20 వికెట్లు పడ్డాయి. ఈ 20 వికెట్లను దక్కించుకుంది కూడా ఫాస్ట్ బౌలర్లే కావడం ఇక్కడ మరో విశేషం. అయితే యాషెస్ సిరీస్‌లో ఇలా మొదటి రోజే ఇరుజట్లు ఆలౌట్ అవ్వడం 124 ఏళ్లలో ఇదే తొలిసారి. చివరిసారిగా ఇలా 1902 జనవరిలో మొదటి రోజు 25 వికెట్లు నేలకూలాయి. అది కూడా ఇదే మైదానంలో కావడం విశేషం. ఇక ఓవరాల్‌గా మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఒకే రోజు 20 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు పడటం ఇది నాలుగోసారి. ఇక తొలి రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 4-0తో ఉంది. క్రీజులో ట్రావిస్ హెడ్ (0), స్కాట్ బొలాండ్ (4) ఉన్నారు. అయితే పిచ్ బౌలర్లకు ఎక్కువగా సహకరించడంతో రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనింగ్ జోడీ మార్చి, మరో కీలక వికెట్ పడకుండా ఆసీస్ జాగ్రత్త పడింది. ఈ మార్పులో భాగంగానే టెయిలెండర్ బొలాండ్‌ను, హెడ్‌తో ఓపెనింగ్‌కు పంపింది. ఇన్నింగ్స్‌ను బొలాండే ప్రారంభించడం విశేషం. గస్ అట్కిసన్ వేసిన తొలి ఓవర్లో ఆరు బంతులు ఎదుర్కోవడమే కాకుండా ఓ ఫోర్ బాదాడు.

## 2025 వన్డేల్లో హైయ్యెస్ట్ రన్ స్కోరర్స్‌గా

# రోహిత్, విరాట్



2025 సంవత్సరం ముగింపునకు వచ్చేసింది. ఈ ఏడాదిలో ఇంకో ఆరు రోజులే మిగిలి ఉన్నాయి. అయితే క్రికెట్ పరంగా ఈ సంవత్సరం స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అభిమానులకు నిరాశ మిగిల్చింది. అనూహ్యంగా ఈ ఇద్దరు స్టార్లు టెస్టుల్లోంచి తప్పుకోవడమే అందుక్కారణం. అయితే టెస్టుల నుంచి రిటైరైన తర్వాత రో-కో వన్డేల్లో కొనసాగుతూ అత్యుత్తమంగా ఆడుతున్నారు. గత రెండు నెలల్లో జరిగిన ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా సిరీస్‌ల్లోనూ విరాట్, రోహిత్ రాణించారు. ఆసీస్ సిరీస్‌లో రోహిత్, సౌతాఫ్రికా సిరీస్‌లో విరాట్ కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'లుగా ఎంపికైయ్యారు. అయితే ఈ ఏడాది ఈ ఇద్దరూ తక్కువ వన్డేలే ఆడినా, అదుతేంగా రాణించారు. 2025లో ఏకంగా ప్రపంచంలోనే వన్డేల్లో అత్యధిక పరుగులు బాదిన టాప్ -10 లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ లిస్ట్‌లో భారత్ నుంచి ప్లేస్ దక్కించుకున్న ఆటగాళ్లు ఈ ఇద్దరే కావడం విశేషం. అయితే ఈ క్యాలెండర్ ఇయర్‌లో ప్రపంచంలోని ఏ బ్యాటర్ కూడా 1000 పరుగుల మార్క్ అందుకోకపోవడం గమనార్హం. ఈ లిస్ట్‌లో ఇంగ్లాండ్ సీనియర్ బ్యాటర్ జో రూట్ టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. అతడు 15 ఇన్నింగ్స్‌ల్లో 57.71 యావరేజ్‌తో 808 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, నాలుగు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2025 ఏడాదిలో విరాట్ కోహ్లీ వన్డేల్లో అత్యుత్తమంగా ఆడాడు. దీంతో టీమ్ఇండియాలో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. 2025లో విరాట్ మొత్తం 13 ఇన్నింగ్స్‌ల్లో 651 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు, 4 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. రీసెంట్‌గా సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో విరాట్ 303 పరుగులు బాది ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఇక ఈ ఏడాది అత్యధిక పరుగులు బాదిన బ్యాటర్ల లిస్ట్‌లో 8వ స్థానంలో ఉన్నాడు. ఏడాది ఆరంభంలో ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఆకట్టుకున్న రోహిత్ ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీలో కాస్త ఇబ్బంది పడ్డాడు. అయితే ఆ టోర్నీ ఫైనల్‌లో హాఫ్ సెంచరీతో మళ్లీ టచ్‌లోకి వచ్చాడు. ఇక ఈ అక్టోబర్‌లో జరిగిన ఆస్ట్రేలియా సిరీస్‌లో సెంచరీ, హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. ఆ తర్వాత సౌతాఫ్రికా సిరీస్‌లోనూ రెండు అర్ధ శతకాలతో రాణించాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది రోహిత్ 14 ఇన్నింగ్స్‌ల్లో 650 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 4 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వరల్డ్‌వైడ్‌గా ఈ లిస్ట్‌లో హిట్‌మ్యాన్ తొమ్మిదో స్థానంలో నిలిచాడు. ఇప్పటికే టెస్టు, టీ20 లకు రిటైర్మెంట్ ఇచ్చేసిన రో-కో ప్రస్తుతం వన్డేల్లోనే ఆడుతున్నారు. అయితే వన్డే ఫార్మాట్ మాత్రం అదుతేంగా రాణిస్తున్నారు. ఈ ఏడాది భారత్ నుంచి అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్లలో ఈ ఇద్దరే టాప్‌లో ఉన్నారు. ఇక మళ్లీ రో-కో జోడీ 2026 జనవరిలో స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో బరిలోకి దిగనుంది.

2025లో ప్రపంచవ్యాప్తంగా వన్డేల్లో అత్యధిక పరుగుల చేసిన టాప్ 10 బ్యాటర్లు

జో రూట్ (ఇంగ్లాండ్)- 808 పరుగులు-
డారిల్ మిచెల్ (న్యూజిలాండ్)- 764 పరుగులు
జార్జ్ మున్సీ (స్కాట్లాండ్)- 735 పరుగులు
మ్యాథ్యూ బ్రిజ్కే (సౌతాఫ్రికా)- 706 పరుగులు
షాయ్ హోప్ (వెస్టిండీస్)- 670 పరుగులు
సల్మాన్ అఘా (పాకిస్థాన్)- 667 పరుగులు
మిలింద్ కుమార్ (యూఎస్ఏ)- 652 పరుగులు
విరాట్ కోహ్లీ (భారత్)- 651 పరుగులు
రోహిత్ శర్మ (భారత్)- 650 పరుగులు
రచిన్ రవీంద్ర (న్యూజిలాండ్) - 604 పరుగులు

## అంగ్‌క్రిష్ రఘువంశీకి తీవ్ర గాయం..



విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా ఉత్తరఖాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఓపెనర్ అంగ్‌క్రిష్ రఘువంశీ తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం జైపూర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా క్యాచ్ కోసం ప్రయత్నించి కిందపడ్డాడు. దాంతో అతని మెడ భాగంలో తీవ్ర గాయమైంది. ఈ నొప్పితో విలవిలలాడిన రఘువంశీని స్ట్రెచర్‌పై ఆసుపత్రికి తరలించారు. గాయం తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అతని ఆరోగ్య పరిస్థితిపై అప్‌డేట్ రావాల్సి ఉంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై నిరీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 331 పరుగులు చేసింది. ఓపెనర్లు రఘువంశీ(11), రోహిత్ శర్మ(0) తీవ్రంగా నిరాశపర్చినప్పటికీ.. ముషీర్ ఖాన్(55), సరఫేరాజ్ ఖాన్(55), హార్దిక్ తోమర్(93) హాఫ్ సెంచరీలతో రాణించారు. షమ్స్ ములానీ(48) త్రుటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. ఉత్తరఖాండ్ బౌలర్లలో దేవంద్ర సింగ్ బోరా మూడు వికెట్లు తీయగా.. నాగర్‌కోటి, మయాంక్ మిశ్రా, సుచిత్, యువరాజ్ చౌదరి తలో వికెట్ తీసారు. అనంతరం ఉత్తరఖాండ్ నిరీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులే చేసి ఓటమిపాలైంది. యువరాజ్ చౌదరి(96) సెంచరీ చేజార్చుకోగా.. జగదీష సుచిత్(51) హాఫ్ సెంచరీతో రాణించాడు. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్, తుక్రమ్ తార్మలే, ముషీర్ ఖాన్ రెండేసి వికెట్లు తీసారు.

## ఈ ఏడాది వీడ్కోలు పలికిన క్రీడా దిగ్గజాలు!

టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు అనేక మంది క్రీడా దిగ్గజాలు ఈ ఏడాది ఆటకు వీడ్కోలు పలికారు. సుదీర్ఘ కాలం తమ ఆటతో అభిమానులను అలరించిన దిగ్గజ ఆటగాళ్లు చివరి ఆట ఆడి అల్విదా ప్రకటించారు. టీమిండియా స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనూహ్యంగా టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో అభిమానులు షాక్‌కు గురయ్యారు. సరిగ్గా ఇంగ్లండ్ పర్యటనకు ముందే వారం రోజుల వ్యవధిలోనే ఈ ఇద్దరు దిగ్గజాలు సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పారు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ తీసుకున్నా.. తనకు ఎంతో ఇష్టమైన టెస్ట్ ఫార్మాట్‌లో కోహ్లీ కొనసాగుతాడని అంతా అనుకున్నారు. కానీ ఏమైందో ఏమో తెలియదు కానీ రోహిత్ శర్మను అనుసరిస్తూనే కోహ్లీ రెడ్ బాల్ క్రికెట్‌కు అల్విదా ప్రకటించాడు. ఈ ఇద్దరి ఆకస్మిక నిరయం వెనుక హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఉన్నాడని ప్రచారం జరిగింది. ఏది ఏమైనా ఈ ఇద్దరి దిగ్గజాల వీడ్కోలును అభిమానులు ఇప్పటికీ జీరించుకోలేకపోతున్నారు. టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన కోహ్లీ, రోహిత్‌లు కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అమెరికా డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లర్ జాన్‌సెనా కూడా ఈ ఏడాదే రిటైర్ అయ్యాడు. డిసెంబర్ 13, 2025న జరిగిన సాటర్డే నైట్స్ మెయిన్ ఈవెంట్‌లో గుంతర్ చేతిలో ఓటమి అనంతరం జాన్‌సెనా రిటైర్మెంట్ ప్రకటించాడు. సుమారు 24 నిమిషాల పాటు సాగిన ఈ హోరాహోరీ పోరులో, గుంతర్ వేసిన 'స్లీపర్ హోల్డ్'కు తట్టుకోలేక సెనా ట్యాప్ ఔట్ అయ్యారు. 2004 తర్వాత జాన్ సెనా ఒక మ్యాచ్‌లో సబ్మిషన్ ద్వారా ఓడిపోవడం ఇదే తొలిసారి. స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ రిటైర్మెంట్ ప్రకటించాడు. 2024 డేవిస్ కప్‌లోనే అతను చివరి మ్యాచ్ ఆడినప్పటికీ.. ఈ ఏడాది అతను వీడ్కోలు గేమ్స్‌లో పాల్గొన్నాడు. కెరీర్‌లో 22 గ్రాండ్ స్లామ్ టైటిళ్లు గెలిచిన రాఫెల్ నాధల్.. ఇందులో 14 ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లు సాధించాడు. ఆటకు తన శరీరం సహకరించదని అల్విదా ప్రకటించాడు. అతని నిరయంతో టెన్నిస్ అభిమానులు శోక సంద్రంలో మునిగిపోయారు. భారత మహిళా హాకీ ప్లేయర్ వందన కటారియా కూడా ఈ ఏడాదే వీడ్కోలు పలికింది. కెరీర్‌లో 330 మ్యాచ్‌లు ఆడి 158 గోల్స్ సాధించింది. టోక్యో ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ గోల్స్ సాధించడం ఆమె కెరీర్‌కే హైలైట్. ఈ ఘనత సాధించిన తొలి భారత హాకీ ప్లేయర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది. వయస్సు కేవలం అంకె మాత్రమే అని నిరూపిస్తూ రోహన్ బోపన్న సుదీర్ఘ కాలం తన కెరీర్ కొనసాగించాడు. ఈ ఏడాది నవంబర్ 1న ఆటకు వీడ్కోలు పలికాడు. 2024లో పురుషుల డబుల్స్‌లో నెంబర్ వన్ ర్యాంక్ సాధించి ఈ ఘనతను అందుకున్న అతిపెద్ద వయస్కుడిగా నిలిచాడు. భారత్‌లో టెన్నిస్‌ను అభివృద్ధి చేయడంపై అతను ఫోకస్ పెట్టాడు. ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ వన్డే క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 అనంతరం అతను ఈ విషయాన్ని వెల్లడించాడు. అఫ్గానిస్థాన్ అతను సాధించిన డబుల్ సెంచరీ మ్యాక్స్‌వెల్ కెరీర్‌కే హైలైట్‌గా నిలిచింది. మ్యాక్సీ ఇక టీ20 ఫార్మాట్‌లో మాత్రమే ఆడనున్నాడు. సౌతాఫ్రికా విధ్వంసకర బ్యాటర్ హెన్రీచ్ క్లాసెన్ 34 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. మూడు ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పిన క్లాసెన్.. ఫ్రాంచైజీ లీగ్ మాత్రమే ఆడుతానని స్పష్టం చేశాడు. కుటుంబం కోసం ఈ నిరయం తీసుకున్నట్లు వెల్లడించాడు. డెన్మార్క్ ఫుట్‌బాలర్ సైమన్ కీరన్ ఈ ఏడాది జనవరి 13న రిటైర్మెంట్ ప్రకటించాడు. యూరో కప్‌లో అతని ప్రదర్శన చరిత్రలో నిలిచిపోయింది. రియల్ మాడ్రిడ్ విజయాల్లో కీలక పాత్ర పోషించిన బ్రెజిలియన్ లెఫ్ట్ బ్యాక్ మార్సెలో ఫిబ్రవరి 6న రిటైర్ అయ్యాడు. అతను 5 ఛాంపియన్స్ లీగ్ ట్రోఫీలను గెలుచుకున్నాడు. వరల్డ్ ఫుట్‌బాల్‌లో అత్యుత్తమ డిఫెండర్లలో ఒకడు.



# మినీ ఫ్రాక్‌లో ఉప్పెన గాళ్ కవ్వింత

ఎరుపు రంగు గిఫ్ట్ ప్యాక్ లతో అందమైన అమ్మాయి.. శాంటా క్యాప్.. స్ట్రాప్ లెస్ వైట్ మినీ డ్రెస్ లో హొయలుపోతూ కనిపిస్తోంది. ఆ అందమైన మోములో కవ్వింత, బాడీ లాంగ్వేజ్ లో తుళ్లింత కుర్రకారును విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. క్రిస్మస్ పార్టీని చాలా ప్రత్యేకంగా ప్లాన్ చేసినట్టే కనిపిస్తోంది ఈ బ్యూటీ. అలా అందంగా ఉల్లాసంగా బోల్డ్ గా ఫోజులిచ్చిన ఈ అందాల సోయగం ఎవరో ప్రత్యేకించి పరిచయం అవసరం లేదు. ఉప్పెన గాళ్ కృతి శెట్టి. వైట్ హాఫ్ షోల్డర్ మినీ ఫ్రాక్ లో గుబులు పుట్టిస్తున్న ఈ బ్యూటీ క్రిస్మస్ ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. కృతి చూడటానికి ఎంత సింపుల్ గా కనిపిస్తోందో, అంతకుమించి కవ్విస్తోంది. అందం ఆత్మవిశ్వాసం ఈ బ్యూటీలో మెండు అని నిరూపిస్తోంది. కెరీర్ మ్యాటర్‌కి వస్తే, ఉప్పెన తర్వాత ఈ బ్యూటీ ఆశించిన బ్లాక్ బస్టర్లు లేక చతికిలబడింది. అయినా నటిగా అవకాశాలకు కొదవేమీ లేదు. ప్రస్తుతం LIK చిత్రంలో ప్రదీప్ రంగనాథన్ సరసన నటిస్తోంది. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. కార్తీ సరసన నటించిన 'వా వాతియార్' విడుదల వాయిదా పడిన తర్వాత కృతి కొంత నీరసపడింది. నిర్మాతలు అప్పులు – ఆర్థిక కారణాల వల్ల ఈ సినిమాని డిసెంబర్‌లో విడుదల చేయలేకపోవడం నిరాశపరిచింది. మరోవైపు కృతి శెట్టి బ్రాండ్స్‌లో ను దూసుకుపోతోంది. ఇటీవల పాపులర్ డ్యూరోఫ్లెక్స్‌కి బ్రాండ్ అంబాసిడర్‌గా సంతకం చేసింది. సోషల్ మీడియాల్లోను వాణిజ్య ప్రకటనలతో ఈ బ్యూటీ ఆర్జిస్తోంది. ఆన్‌లైన్ ద్వేషం, నిరంతర విమర్శలు తన మానసిక ఆరోగ్యంపై చూపే ప్రభావం గురించి కృతి శెట్టి ఇటీవల మాట్లాడింది. ట్రోలింగ్, చెడు మాటలు తనను ఎంతగా వేధించాయో కూడా వెల్లడించింది. ఉబికి వచ్చే కన్నీళ్లను ఆపుకోలేక, నిరంతరం ప్రజల జడ్జిమెంట్లు వినలేక చాలా ఆవేదనకు గురయ్యానని కృతి వెల్లడించింది. నా అదుపులో ఉండని విషయాలపైనా తిట్లు తిన్నాను. అది నన్ను చాలా వేధించిందని కృతి తెలిపింది. "కొన్నిసార్లు చాలా తిరస్కరణను ఎదుర్కొంటాము. నేను సాధారణంగా చాలా ఆశావాదిని అయినా .. ఒక్కోసారి నన్ను నేను కోల్పోయినట్టు అనిపిస్తుంది.. అది నిరాశను కలిగిస్తుంది" అని చెప్పింది. ఇలాంటి సమయాల్లో తన కుటుంబం, సన్నిహితుల మద్దతు, ముఖ్యంగా తన తల్లి మద్దతు తనకు సహాయపడిందని కృతి చెప్పింది.



# అదరహో అనిపిస్తున్న అనన్య అందాలు..

అనన్య పాండే.. బాలీవుడ్ బ్యూటీగా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె తాజాగా నటించిన చిత్రం 'తు మేరీ మైన్ తేరా మైన్ తేరా తు మేరీ'. కార్తీక్ ఆర్యన్ హీరోగా వచ్చిన ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. క్రిస్మస్ సందర్భంగా విడుదలైన ఈ సినిమా మొదటి రోజే 8.46 కోట్ల కలెక్షన్స్ వసూలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సమీర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఇప్పుడు ప్రేక్షకులను అలరిస్తోంది అని చెప్పవచ్చు. ఇకపోతే ఈ సినిమా నిన్న థియేటర్లలోకి రావడంతో సినిమాపై మరింత బజ్ క్రియేట్ చేయడానికి సినిమా షూటింగ్ సమయంలో తీసుకున్న కొన్ని ఫోటోలను అలాగే ఆ సినిమా షూటింగ్ సంబంధించిన మధుర క్షణాలను అభిమానులతో పంచుకుంది అనన్య పాండే. అంతేకాదు బికినీ అందాలు ఆరబోస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. గ్లామర్ డోస్ పెంచేసి బికినీ అందాలతో రచ్చ రేపింది అనన్య పాండే. పైగా ఈ సినిమా షూటింగ్ సమయాన్ని ఎప్పటికీ మర్చిపోలేను అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ప్రస్తుతం అనన్య పాండే షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.



# 'ధురంధర్' కలెక్షన్ల దూకుడు

## వెయ్యికోట్ల క్లబ్‌లో చేరిన మూవీ

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. తాజాగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరి భారతీయ సినిమా రికార్డులను తిరగరాసింది. విడుదలైన కేవలం 21 రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1006.7 కోట్ల వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఇప్పటివరకు ఇండియాలో రూ. 789.18 కోట్ల గ్రాస్ (రూ. 633.5 కోట్ల నెట్) వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం ఓవర్సీస్ మార్కెట్‌లో రూ. 217.5 కోట్ల మార్కును దాటి దూసుకుపోతోంది. దీంతో అత్యధిక వసూళ్లు సాధించిన మొదటి 10 భారతీయ చిత్రాల జాబితాలో 'ధురంధర్' 9వ స్థానంలో నిలిచింది. అలాగే రణబీర్ కపూర్ 'యానిమల్' రికార్డులను ఈ చిత్రం అధిగమించింది.'ఉరి' వంటి సెన్సేషనల్ హిట్ ఇచ్చిన ఆదిత్య ధర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. రణ్‌వీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, మాధవన్ వంటి దిగ్గజ నటులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటించారు. 1999 కాందహార్ విమానం హైజాక్, 2001 పార్లమెంట్ దాడి వంటి యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. మరోవైపు ఈ సినిమా సీక్వెల్ వచ్చే ఏడాది మార్చి 19న ఈద్ కానుకగా విడుదల కాబోతుంది. మొదటి భాగం కేవలం హిందీలోనే సంచలనం సృష్టించగా, రెండో భాగాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేయనున్నారు.


# క్రేజీ టాక్‌తో సాగుతున్న కొత్త సినిమాలు

## క్రిస్మస్‌కు విడుదలైన చిన్ని సినిమాల దూకుడు





క్రిస్మస్ పండుగ సందర్భంగా టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద చిన్న చిత్రాల సందడి నెలకొంది. విభిన్న కథాంశాలతో వచ్చిన ఈ సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విజయవంత అయ్యాయి. అయితే ఈ చిత్రాల తొలిరోజు వసూళ్ల వివరాలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఇందులో శ్రీకాంత్ తనయుడు రోషన్ నటించిన ఛాంపియన్ కలెక్షన్లలో అగ్ర స్థానంలో ఉండగా.. ఆది శంబాల, ఈషా, దండోరా చిత్రాలు తర్వాతి స్థానంలో నిలిచాయి. శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా, ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో వచ్చిన పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'ఛాంపియన్'. ఫుట్‌బాల్ క్రీడ నేపథ్యంలో సాగే ఈ చిత్రం పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. రోషన్ నటనకు మంచి మార్కులు పడటంతో, తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రూ. 4.5 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి రోషన్ కెరీర్‌లోనే బెస్ట్ ఓపెనింగ్స్‌గా నిలిచింది. ÷ూలా కాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆది సాయికుమార్ 'శంబాల'తో సాలిడ్ కంబ్యాక్ ఇచ్చారు. యుగంధర్ ముని దర్శకత్వంలో వచ్చిన ఈ సూపర్ నాచురల్ థ్రిల్లర్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తోంది. సైన్స్ మరియు దైవత్వం మధ్య సాగే ఈ చిత్రం మొదటి రోజు రూ. 3.3 కోట్ల వసూళ్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద నిలకడగా కొనసాగుతోంది. హెబ్బా పటేల్, అరుణ్ ఆదిత్ ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ థ్రిల్లర్ 'ఈషా'. బన్నీ వాస్, వంశీ నందిపాటి సమర్పణలో వచ్చిన ఈ సినిమా ముఖ్యంగా క్లైమాక్స్ ట్విస్ట్‌లతో ఆడియన్స్‌ను భయపెట్టిస్తోంది. క్రేజీ ప్రమోషన్స్ కారణంగా ఈ చిత్రం తొలిరోజు రూ. 2.18 కోట్ల వసూళ్లను తన ఖాతాలో వేసుకుంది.నటుడు శివాజీ ప్రధాన పాత్రలో, గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'దండోరా'. విడుదలకు ముందు వివాదాలు చుట్టుముట్టినా, విడుదలయ్యాక సినిమాలోని కంటెంట్ బాగుండటంతో పాజిటివ్ టాక్ వస్తోంది. ఈ చిత్రం మొదటి రోజు సుమారు రూ. 1.50 కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. ఇక క్రిస్మస్ సెలవులకు తోడు న్యూ ఇయర్ హాలిడేస్ కూడా దగ్గర పడుతుండటంతో, ఈ చిత్రాల వసూళ్లు రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది.





Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# ఆళ్లగడ్డ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**కారును ఢీకొన్న ట్రావెల్ బస్సు.. ప్రమాదంలో నలుగురు హైదరాబాదీల మృతి**

**ప్రమాదంపై మంత్రి జనార్ధన్ రెడ్డి ఆరా**



**నంద్యాల:** ఆళ్లగడ్డ మండలం నల్లగట్లలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు, ట్రావెల్స్ బస్సు ఢీకొని నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో వేగంగా దూసుకెళ్లిన కారు.. డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న సీజీఆర్ ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. దీంతో ఈ ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మృతులంతా హైదరాబాద్ వాసులుగా తెలుస్తోంది. మృతిచెందిన వారిని గుండురావు(60), శ్రావణ్ (22), నరసింహ, బన్నీగా గుర్తించారు. తోటి ప్రయాణికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను రక్షించి స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలిస్తున్నారు. మరోవైపు ఘటనా స్థలాన్ని డీఎస్పీ ప్రమోద్ కుమార్ సైతం పరిశీలించారు. ఈ ప్రమాదంపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నలుగురు మృతిచెందడం అత్యంత దురదృష్టకరం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంపై జిల్లా అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు తక్షణమే వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. ఘటనా స్థలానికి వెళ్లి అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆజ్ఞాపించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తరచూ రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్న క్రమంలో ప్రయాణికులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి జనార్ధన్ రెడ్డి సూచించారు.

# బ్రహ్మోస్ క్షిపణులకు ఎంతో డిమాండ్: కేంద్రమంత్రి జితేంద్రసింగ్



**తిరుపతి :** దశాబ్ద కాలంగా స్టార్టప్‌లలో భారత్ దూసుకెళ్తోందని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ అన్నారు. స్పేస్ ఎకానమీలో 8వ స్థానానికి చేరుకున్నామని చెప్పారు. ఐటీ, టెలికాం రంగాల్లో పెట్టుబడులను సరళతరం చేసినట్లు వివరించారు. తిరుపతి భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 'గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 81వ ర్యాంక్ నుంచి 38వ ర్యాంక్‌కు చేరుకున్నాం. చంద్రుడిపై ప్రయోగాల్లో భారత్ ఘన విజయాలు సాధించింది. రక్షణరంగ ఎగుమతుల్లో గణనీయ వృద్ధి సాధించాం. మన బ్రహ్మోస్ క్షిపణులకు ఇప్పుడు ప్రపంచంలో ఎంతో డిమాండ్ ఉంది. ప్రపంచానికి కొవిడ్ వ్యాక్సిన్లు అత్యధికంగా ఎగుమతి చేసిన దేశం భారత్. శాస్త్ర, సాంకేతిక రంగాలకు మోదీ హయాంలో బ్జడెట్ పెరిగింది. అంతరిక్ష రంగంలో ప్రైవేటు పెట్టుబడులను కూడా ప్రోత్సహిస్తున్నాం. కీలక ఖనిజాల విషయంలో ప్రైవేటు సంస్థలకూ అనుమతి ఇస్తున్నాం'అని జితేంద్రసింగ్ తెలిపారు.

# టీవీ9 రజినీకాంత్ తండ్రికి మంత్రుల నివాళి

**సాంబశివరావు పెద్దకర్మకు హాజరైన కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి**

**పెన్షనర్ల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం: మంత్రి కోమటిరెడ్డి**



**గుంటూరు, డిసెంబర్ 26 (సమయం న్యూస్):**

టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ వెల్లలచెరువు రజినీకాంత్ తండ్రి, దివంగత వెల్లలచెరువు సాంబశివరావు పెద్దకర్మ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రులు హాజరై ఘన నివాళులర్పించారు. గుంటూరులో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. సాంబశివరావు చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఏఐబీడీపీఏ ఆంధ్రప్రదేశ్ శాఖ ఉపాధ్యక్షుడిగా సాంబశివరావు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సాంబశివరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. రజినీకాంత్ గారికి, వారి కుటుంబ సభ్యులకు మంత్రులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, మనోధైర్యం కల్పించారు.

# పాలనలోనూ, సేవల్లోనూ స్పీడ్ ఆఫ్ డూయింగ్

**315 కీలక ప్రగతి సూచికల్లో జిల్లా నెం.1**

**అయితే ఏ గ్రేడ్ నుంచి ఏ ప్లస్ (అచీవర్) గ్రేడ్ సాధనకు కృషిచేయాలి**

**జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ)లో నెం.2కు చేరుకోవాలి**

**స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి**

**జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశంలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**





**విజయవాడ:** స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధన దిశగా చేస్తున్న ప్రయాణంలో వివిధ శాఖలకు సంబంధించి 315 కీలక ప్రగతి సూచిక (కేపీఐ)ల్లో 83 స్కోరుతో జిల్లా రాష్ట్రంలోనే నెం.1గా నిలిచిందని, ఇందుకు కలెక్టర్ సారథ్యంలోని జిల్లా అధికార యంత్రాంగానికి అభినందనలు తెలియజేస్తున్నానని.. అయితే ఫ్రంట్ రన్నర్‌గా ఉన్న జిల్లా ఏ ప్లస్ అచీవర్ స్థాయికి చేరుకునేందుకు కృషిచేయాలని, సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా పాలనలోనూ, సేవల పంపిణీలోనూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ స్ఫూర్తితో పనిచేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన నగరంలోని ఇరిగేషన్ కాంపౌండ్ రైతు శిక్షణ కేంద్రంలో 4వ జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు,

జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. గత డీఆర్‌సీ సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన వివిధ అంశాలపై తీసుకున్న చర్యలపై చర్చించారు. ఎన్ని అంశాలు పరిష్కారమయ్యాయి? వివిధ దశల్లో ఉన్నవి ఎన్ని? సమాచారాన్ని విశ్లేషించి ప్రతి అంశానికీ కచ్చితమైన పరిష్కారం లభించేలా కార్యాచరణకు మంత్రి దిశానిర్దేశం చేశారు. పరిశ్రమలు, వైద్య ఆరోగ్యం, రహదారులు, వ్యవసాయ అనుబంధ రంగాలు, శాంతిభద్రతలు, పోలీస్ కమిషనరేట్ అమలుచేస్తున్న వినూత్న కార్యక్రమాలు, జీవో నెం.30 అమలు, పీఎం సూర్యఘర్ తదితరాలపై సమావేశంలో చర్చించారు. రెవెన్యూ సేవలు, సమస్యల పరిష్కారానికి సంబంధించిన దరఖాస్తుల సత్వర పరిష్కారం, రహదారుల పనుల్లో వేగవంతం, విజయవాడ రూరల్ పరిధిలో సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధుల కట్టడి, ఎ.కొండూరు కిడ్నీ వ్యాధిగ్రస్థులకు అందిస్తున్న సేవలు తదితరాలకు సంబంధించి ప్రజాప్రతినిధులు వివిధ అంశాలను సమావేశం దృష్టికి తీసుకురాగా అధికారులు వివరణ ఇచ్చారు. ఆయా అంశాల కార్యాచరణకు మంత్రి సూచనలు చేశారు. శాసనభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య).. రెవెన్యూ సేవల దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరముందన్నారు. సమావేశం అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. గత సమావేశంలో గౌరవ ప్రజాప్రతినిధులు లేవనెత్తిన 61 అంశాలకు సంబంధించి 11 అంశాల పరిష్కారం పూర్తయిందని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. టెండర్ల ప్రక్రియతో పాటు డీపీఆర్‌ల సత్వర రూపకల్పనపైనా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. 2023-24లో తలసరి ఆదాయం రూ. 3,21,651 కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ. 4,17,412 అని, ఇదేవిధంగా జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ) 2024-25లో రూ. 94,561 కోట్లు కాగా 2025-26 లక్ష్యం రూ. 1,12,148 కోట్లు అని.. జిల్లా ఈ రెండు అంశాల్లోనూ లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతి దిశగా పయనిస్తోందని వివరించారు. రాష్ట్ర పథకాలతో పాటు కేంద్ర ప్రాయోజిత పథకాల అమల్లోనూ అభివృద్ధి కార్యక్రమాల్లోనూ జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. విద్యుత్ వినియోగదారులను ఉత్పత్తిదారులను చేసే పీఎం సూర్యఘర్‌పైనా ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త నినాదాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు స్థానికంగా ఉపాధి కల్పనకు, ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే విధంగా ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కులతో పాటు ప్రతి మండలంలోనూ చిన్న పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చొరవచూపుతున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 2025-26కు సంబంధించి జిల్లాలో 1,600 ఎంఎస్‌ఎంఈ యూనిట్ల రిజిస్ట్రేషన్‌ను లక్ష్యంగా నిర్దేశించుకోగా నవంబర్ 25 నాటికి 1,121 (70.06 శాతం) పూర్తయ్యాయన్నారు. ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని.. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణంతో పాటు డిజిటల్ రికార్డుల అనుసంధానంతో వ్యక్తి కేంద్రీకృత ఆరోగ్య సేవల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పీఎం అభిమ్, ఆర్‌బీఎస్‌కే తదితరాల అమల్లోనూ ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో జిల్లాను అన్ని విధాలా ముందు వరుసలో నిలిపేందుకు కృషిచేస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. క్రమం తప్పకుండా డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా కేసులు నమోదైనప్పటికీ ఒక్క మరణం కూడా సంభవించకుండా సమర్థవంతమైన వైద్య సేవలతో కృషిచేశామన్నారు. ఎ.కొండూరులో ప్రతివారం నెఫ్రాలజిస్టు వైద్య సేవలను అందిస్తున్నామని, ఇందుకు సంబంధించి గిరిజన తండాల్లో టాంటాం కూడా వేయిస్తున్నామని తెలిపారు. కృష్ణాజలాల పంపిణీపై ట్రయల్ రన్ జరుగుతోందని.. త్వరలోనే పూర్తిస్థాయిలో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అదనపు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తున్నట్లు వివరించారు. సమస్య మూలాలను గుర్తించేందుకు ఐసీఎంఆర్ టీమ్ కోసం లేఖ రాశామన్నారు. ఈ-ఆఫీస్ దస్త్రాల కారణంగా దస్త్రాల పరిష్కార స్థాయిని తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. డీఆర్‌సీ సమావేశంలో గౌరవ ప్రజాప్రతినిధులు లేవనెత్తిన ప్రతి అంశాన్నీ క్షుణ్నంగా పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులు ఇస్తున్న వివిధ రకాల రుణాలను కేడీసీసీ ద్వారా కూడా ఇచ్చేందుకు చొరవ చూపుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 425 సహకార సంఘాలు, సభ్యులను కూడా సౌరవిద్యుత్ వ్యవస్థకు అనుసంధానించేలా కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో సారవంతమైన భూములున్నాయని.. ఇరిగేషన్ శాఖ సమన్వయంతో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ప్రగతికి దృష్టిసారించాల్సిన అవసరమైందన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న వినూత్న చర్యలను డీసీపీ కేజీవీ సరిత వివరించారు. వయోవృద్ధులకు ఓటీపీ మోసాలతో పాటు డిజిటల్ అరెస్టులపైనా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అస్త్రం యాప్‌తో ట్రాఫిక్ నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా రెండు కోట్ల పరిహారాన్ని అందజేయడం జరిగిందన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు వినూత్న కార్యాచరణతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎం.లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

# సైబర్ నేరాల్లో కీలక నిందితుడి అరెస్ట్

**వేల సంఖ్యలో సిమ్ కార్డులు, కంప్యూటర్‌లు స్వాధీనం**



**అమరావతి :** సైబర్ నేరాలకు పాల్పడే కీలక నిందితుడిని ఏపీ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి వేల సంఖ్యలో సిమ్ కార్డులతో పాటు, పలు కంప్యూటర్‌లు, ఇతర సాంకేతిక పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై సీఐడీ డీజీ ఆసిఫ్ ఖాన్ మీడియాతో మాట్లాడుతూ.. సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇంటర్నేషనల్ మోసగాడిని అరెస్టు చేశామన్నారు. ఈ మోసాలకు పాల్పడేందుకు అనేక రకాల అధునాతన సాంకేతిక పరికరకాలు వాడుతున్నారని తెలిపారు. వారి నుంచి అనేక పరికరాల ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంటర్నేషనల్ కాల్స్‌ను లోకల్ కాల్‌గా మార్చి చూపుతున్నారని.. దీంతో చాలా మంది కాల్స్ మాట్లాడటం ద్వారా మోసపోతున్నారని చెప్పారు. దేశ వ్యాప్తంగా పది వేల కోట్ల వరకు మోసం చేశారని.. ఒక్క ఏపీలో ఇరవై కోట్లు వరకు మోసం చేశారన్నారు. ఈ విధంగా అనేక దేశాల వారిని మోసం చేశారని... ఒకేసారి 64 సిమ్‌లతో వీరు కాల్స్ చేస్తున్నారని సీఐడీ డీజీ చెప్పారు. వేలకోట్ల రూపాయలు మోసాల ద్వారా దోచుకున్నారని తెలిపారు. సిమ్ బాక్స్ ద్వారా, మాడ్యూల్స్ ద్వారా వీరు ఆపరేషన్ చేస్తున్నారన్నారు. ఎక్కడ నుంచి కాల్ చేసేది తెలియకుండా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. టెలిగ్రామ్ యాప్ ద్వారా వీరు మోసపూరిత లింక్‌లు పంపిస్తున్నారని అన్నారు. ఫేక్ కేవైసీ చేసి ఈ ముఠా సిమ్ కార్డులు సంపాదిస్తున్నారని చెప్పారు. ఏ సిమ్ ఎప్పుడు ఎలా ఆపరేట్ చేయాలో టెలిగ్రామ్ యాప్ ద్వారా వారికి సంకేతాలు పంపుతారని.. ఇదంతా పెద్ద ఆర్గనైజ్ క్రైంగా జరుగుతుందని వివరించారు. ఇందులో చాలా మందికి భాగస్వామ్యం ఉందన్నారు. కొంతమంది తెలిసి, మరికొందరు తెలియక ఈ ముఠాతో భాగస్వామ్యం అవుతున్నారని.. ప్రజలు కూడా వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అజ్ఞాత వ్యక్తులు నుంచి వచ్చే కాల్స్ పట్ల అలెర్టుగా ఉండాలన్నారు. ఒక్క చోటే కూర్చుని అనేక దేశాల ప్రజలను వీరు మోసం చేస్తున్నారని సీఐడీ డీజీ ఆసిఫ్ ఖాన్ వెల్లడించారు.

# వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై మంత్రి ఆరా

**రిటైనింగ్ వాల్ వెంటనే పూర్తి చేయాలని ఆదేశం**

**అమరావతి, డిసెంబర్ 26:** వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ప్రాజెక్ట్ సీఈ, ఎస్ఈ, ఈఈలు, ఏజెన్సీ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. '7 కి.మీ టన్నెల్-2 లైనింగ్ పనుల్లో నేటికి 3.2 కి.మీ పూర్తయ్యింది. డిసెంబర్‌లో 456 మీటర్ల లక్ష్యానికి గానూ,432 మీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేశాం. మిగిలిన 3.6 కి.మీ లైనింగ్ 2026 జూన్ కల్లా పూర్తి చేసేలా లక్ష్యం నిర్దేశించాం. టన్నెల్-2లో చిక్కుకొని ఉన్న టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగించడానికి నియమించిన కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. టీబీఎంను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వెంటనే మొదలుపెట్టి, సీజన్ ముగిసేలోగా పూర్తి చేయాలని అధికారులకు, ఏజెన్సీకి ఆదేశాలు ఇచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 2026 నాటికి వెలిగొండ పూర్తిచేయడమే లక్ష్యంగా పర్యవేక్షణ జరుగుతోంది' అని ఆయన అన్నారు.

# మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి ఆహ్వానం



**నర్సీపట్నం:** ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో 2026లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న '3వ ప్రపంచ తెలుగు మహాసభల'కు ముఖ్య అతిథిగా హాజరుకావలసిందిగా కోరుతూ, పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును ఆహ్వానించారు. ఈమేరకు శుక్రవారం స్పీకర్ నివాసంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. మహాసభల విశేషాలను స్పీకర్ కి వివరించారు. 'తెలుగు వారి అనురాగ సంగమం' అనే నినాదంతో 2026 జనవరి 3, 4 , 5 తేదీలలో గుంటూరు, అమరావతిలోని శ్రీ సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ (సాయి బొమ్మిడాల నగర్) వేదికగా ఈ మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలలో ప్రధాన వేదికకు 'దివ్యశ్రీ నందమూరి తారక రామారావు వేదిక'గా నామకరణం చేశామని, అలాగే శ్రీనాథ కవి, జాషువా, ఘంటసాల వంటి మహనీయుల పేర్లతో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అవధానాలు, సంగీత విభావరి, సాహిత్య సదస్సులు, జానపద కళలు, నాటక ప్రదర్శనలతో తెలుగు భాషా వైభవాన్ని చాటి చెప్పేలా భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు గజల్ శ్రీనివాస్ స్పీకర్ కు వివరించారు. ఈ ఆహ్వానంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు హర్షం వ్యక్తం చేశారు. దివంగత ఎన్టీ రామారావు పేరుతో ఈ మహా వేదికను నిర్వహిస్తుండడం తెలుగుజాతికే గర్వకారణమని కొనియాడారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తాను తప్పకుండా పాల్గొంటానని నిర్వాహకులకు హామీ ఇచ్చారు.

స్పీకర్ ను కలిసిన వారిలో ఆంధ్ర సారస్వత పరిషత్ వైస్ ప్రెసిడెంట్ మేడికొండ శ్రీనివాస్ చౌదరి, పరిషత్ సలహాదారు అడ్డాల వాసు ఉన్నారు. అలాగే నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ రాజాన వీర సూర్యచంద్ర, ఇతర టీడీపీ నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వంగవీటి ఆశా కిరణ్ ను కలిసిన పాయకరావుపేట కాపునాడు నాయకులు



**పాయకరావుపేట:** దివంగత మహా నేత వంగవీటి మోహన రంగా కుమార్తె వంగవీటి ఆశా కిరణ్ ను శుక్రవారం మర్యాద పూర్వకంగా పాయకరావుపేట కాపునాడు నాయకులు కలిశారు. విశాఖపట్నంలో జరిగే చలో వైజాగ్ రంగా నాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న వంగవీటి ఆశా కిరణ్ పాయకరావుపేటలో స్థానిక వై జంక్షన్ లోని జగతా అప్పారావు కళ్యాణ మండపంలో కాపునాడు నాయకులు, కార్యకర్తలు, రంగా అభిమానులతో సమావేశమయ్యారు. నాయకులందరినీ ఆప్యాయంగా పలకరించారు. నాయకులు, కార్యకర్తలతో కలసి ఫొటోలు దిగారు. అనంతరం పాయకరావుపేటలో అభిమానుల కోరిక మేరకు భోజనం చేసి విశాఖపట్నంలో జరుగుతున్న రంగా నాడు సమావేసానికి బయలు దేరారు. కాపునాడు రాష్ట్ర నాయకులు జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాపునాడు నాయకులు అక్కిరెడ్డి వెంకట నాగేశ్వరరావు, సుంకర చిట్టిబాబు, పెద్ద సంఖ్యలో కాపునాడు నాయకులు, వంగవీటి మోహన్ రంగా అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా వీర్ బాల దివస్



**పాయకరావుపేట:** మండలంలోని మంగవరం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన "వీర్ బాలా దివస్" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సంధర్భంగా స్కూల్లోని డిజిటల్ క్లాస్ రూమ్ లో లైవ్ టెలికాస్ట్ వేసి విద్యార్థులు అందరికీ వివరించారు. ఈ కార్యక్రమం భారతదేశ భవిష్యత్తుకు పునాదులైన పిల్లలను గౌరవించేందుకు చేస్తున్న జాతీయ స్థాయి ప్రోగ్రామ్ అని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు లలిత, రంజాన్ బీబీ, అంగన్వాడీ కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి రంగా 37వ వర్ధంతి



**పాయకరావుపేట:** పట్టణంలోని మెయిన్ రోడ్డులో జివిఆర్ నగర్ దగ్గర ఉన్న దివంగత మహా నేత వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద శుక్రవారం రంగా 37 వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాపునాడు రాష్ట్ర నాయకులు జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, డాక్టర్ గురు ప్రసాద్, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ జగతా శ్రీను, దగ్గుపల్లి సాయి బాబా, గూటూరు శ్రీనివాసరావు, మజ్జూరి నారాయణరావు, గొల్లపల్లి నాగు, నారపురెడ్డి పద్మావతి పెద్ద సంఖ్యలో కాపు నాయకులు పాల్గొన్నారు.

# గంజాయి స్మగ్లింగ్ ముఠా గుట్టు రట్టు

**లేడీ డాన్ రేణుక సహా 8 మంది స్మగ్లర్లు అరెస్ట్**

**రూ.33.10 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం**

**డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు వెల్లడి**



**నర్సీపట్నం:** ఏజెన్సీ ముఖద్వారం నర్సీపట్నం కేంద్రంగా అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఎనిమిది మంది సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 18.50 లక్షల విలువైన 74 కిలోల గంజాయి, రూ. 10 లక్షల విలువైన షిఫ్ట్ కారు, రూ. 3 లక్షల విలువైన టీవీఎస్ జూపిటర్ స్కూటీ, రూ. 1.60 లక్షల విలువైన ఎనిమిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాశరావు వెల్లడించారు. మొత్తం స్వాధీనం చేసిన వస్తువుల విలువ రూ. 33.10 లక్షలు ఉంటుందని తెలిపారు. శుక్రవారం సాయంత్రం నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాకు ముఖద్వారంగా ఉన్న నర్సీపట్నాన్ని షెల్టర్ జోన్‌గా మార్చుకుని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివాసం ఉంటూ గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారని చెప్పారు. నిందితులంతా గతంలోనూ గంజాయి కేసుల్లో నిందితులేనని తెలిపారు. ఈ ముఠాలో గాదె రేణుక అనే లేడీ డాన్ కూడా ఉండడం గమనార్హమని తెలిపారు. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మోడుగులపేట గ్రామానికి చెందిన గాదె రేణుక బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నప్పటికీ, గంజాయి స్మగ్లింగ్‌కు ప్రధాన సూత్రధారిగా వ్యవహరిస్తోందని వెల్లడించారు. ఈమెపై సాలూరు రూరల్, పాయకరావుపేట, నర్సీపట్నం టౌన్, బెంగళూరు పరిధిలో పలు గంజాయి కేసులు నమోదయ్యాయని తెలిపారు. గత ఏడాది కాలంగా నర్సీపట్నంలోని శారదానగర్‌లో అద్దెకు ఉంటూ గంజాయి అక్రమ రవాణాను కొనసాగిస్తోందని ఆయన చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా బలిమెల, చిత్రకొండ, దారకొండ, రంపులుగాటీ, బూదరాళ్ల, కాకరపాడు మొదలైన ఏజెన్సీ ప్రాంతాల నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లుగా మార్చి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారని విచారణలో వెల్లడైందన్నారు. హైవే చెక్‌పోస్టులను తప్పించుకునేందుకు అడవి మార్గాల ద్వారా గంజాయిని తరలిస్తూ, అనంతరం కారులో తమిళనాడుకు తీసుకెళుతున్నారని తెలిపారు. ఇతర నిందితుల్లో తమిళనాడు, అల్లూరి సీతారామరాజు జిల్లా, విశాఖపట్నం జిల్లాలకు చెందినవారు ఉండగా, వీరిపై కూడా పలు పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులు నమోదై ఉన్నాయని పేర్కొన్నారు.

ముగ్గురు మహిళలు సహా మొత్తం ఎనిమిది మందిని, లేడీ గంజాయి డాన్ గాదె రేణుక సహా నితిన్ సూర్య కాళిదాసు, రవికాంత్, అడ్డూరి ప్రసాద్, మదన్ కుమార్ ఆంటోనీ స్వామి, అడంగుల రవికుమార్, దండం లలితకుమారి, పొన్నగంటి మణికుమార్ లను, నాతవరం మండలం శృంగవరం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మాటువేసి పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో రూరల్ సీఐ రేవతమ్మ, నాతవరం ఎస్ఐ తారకేశ్వరావు సహా పోలీస్ సిబ్బంది కీలక పాత్ర పోషించారని డీఎస్పీ ప్రశంసించారు. లేడీ డాన్ అరెస్టుతో గంజాయి గమ్యస్థానాలు, సరఫరా మార్గాలు వెలుగులోకి వచ్చాయని, మరింత సమాచారం కోసం దృష్టి సారించామని డిఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

## రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి




**చల్లపల్లి:** చల్లపల్లిలో జనవరి రెండవ తేదీ నుంచీ జరిగే రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, రీసర్వే డీటీ నీలిమలు రైతులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గ్రామపంచాయతీ వద్ద రీసర్వే గ్రామసభ జరిగింది. ఈ సం దర్భంగా రీసర్వే డీటీ నీలిమ మాట్లాడుతూ, జనవరి రెండవ తేదీ నుంచీ గ్రామంలో రీసర్వే కార్యక్రమం జరుగుతుందనీ ఈమేరకు రైతులు తమ పొలాలకు సంబంధించిన దస్తావేజు, పాసుపుస్తకం, ఆధార్కార్డు జిరాక్సులు, మొబైల్ నంబరు, పాస్పోర్టు సైజు ఫొటోను వీఆర్వోకు అందచేయాలన్నారు. సర్వే చేసేరోజు రైతులకు ముందుగా తెలియచేసి భూమిమీదు వెళ్లి వారి హక్కుపత్రాలు చూసి గ్రౌండ్ ట్రూతింగ్ ప్రారం భిస్తారనీ, అనంతరం వారికి నోటీసులు అందచేస్తారన్నారు. చల్లపల్లి గ్రామంలో 1129.03 పూరా విస్తీర్ణంలో సాగుభూమికి సంబంధించి రీసర్వే చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పివి. మాధవేంద్రరరావు, వీఆర్వో మల్లవోలు ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి మోహన రంగా వర్ధంతి



**చల్లపల్లి:** దివంగత కాంగ్రెస్ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పడమరవీధిలోని రంగా విగ్రహానికి ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నసీంఘోరి, బీజేపీ మండల అధ్యక్షుడు అడపా రవిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు రావి రాజేశ్వరరావు, తుటారం ప్రసాద్, షేక్ సిలార్, గోవాడ రాము, గోళ్ల ప్రసాద్, రాయవరపు నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

## చందనాలంకృత మత్స్యావతారంలో శ్రీ వెంకటేశ్వరస్వామి



**చల్లపల్లి:** ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీగరుడ ఆంజనేయ సహిత వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారిని చందనంతో మత్స్యావతారునిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం ధన్వంతరాచార్యులు విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ, ధనుర్మాస మహోత్సవము, మంగళ శాసనములు.. దివ్యప్రబంధము, తిరుప్పావైపాశుర విన్నపం తదితర పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి చందనాలంకృతుడైన స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



## బీజేపీలో చేరిన టీడీపీ నేత

**నర్సీపట్నం:** మండలంలో ధర్మసాగరం గ్రామానికి చెందిన ప్రస్తుత టీడీపీ బూత్ కమిటీ కన్వీనర్ సుకల శ్రీనివాస్ భారతీయ జనతా పార్టీలో చేరారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న శ్రీనివాస్ బీజేపీలో చేరడం గ్రామ స్థాయిలో టీడీపీకి గట్టి దెబ్బగా మారిందని బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివియన్ మాధవ్ సమక్షంలో శుక్రవారం శ్రీనివాస్ పార్టీ కండువా వేసుకుని అధికారికంగా బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై శ్రీనివాస్ బీజేపీలో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీరంరెడ్డి సూర్యనారాయణ, ఓబీసీ జిల్లా మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కె.వి. సత్యనారాయణ, నర్సీపట్నం టౌన్ బీజేపీ అధ్యక్షుడు బోలెం అప్పన్నదొర, నర్సీపట్నం మండల బీజేపీ అధ్యక్షుడు నిద్దర శ్రీనివాస్, గవిరెడ్డి త్రినాథ్, బోలెం శివ, మాకవరపాలెం మండల పార్టీ అధ్యక్షుడు మర్రి నాయుడు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.